https://epaper.dksaardyamlochaatimpu.com

E-mail: dkchaatimpu80@gmail.com RNI. NO. APTEL/2008/26737

డీకే సారధ్యంలో చాటింపు

తెలంగాణ దిన పత్రిక



హైదరాబాద్ సంపుటి : 18 సంచిక : 12 ఎడిటర్ : పూసాల శ్రీనివాస్ బుధవారం,అక్టోబర్,7,2026 పేజీలు : 8 వెల : రూ.1/-

కరెంట్ డిమాండ్‌లో బిగ్ రికార్డ్..

20 వేల మెగావాట్లకు చేరిక.!

- పులిచింతల పవర్ ప్లాంట్‌ను పరిశీలించిన భట్టి విక్రమార్క-రాష్ట్రంలో సరికొత్త రికార్డు స్థాయికి విద్యుత్ డిమాండ్-ఎల్‌నినో ప్రభావంతో 4 వేల మెగావాట్ల జలవిద్యుత్ తగ్గుదల- విద్యుత్ కోతలు లేకుండా సరఫరా చేస్తున్న సంస్థలు



సూర్యాపేట,అక్టోబర్,06: సూర్యాపేట జిల్లాలోని పులిచింతల జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సందర్శించారు. ఈ సందర్భంగా ప్లాంట్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని, ఇప్పటివరకు జరిగిన విద్యుత్ ఉత్పత్తి వివరాలను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం యూనిట్ కంట్రోల్ రూమ్‌ను స్వయంగా పరిశీలించిన డిప్యూటీ సీఎం, ప్రాజెక్టు నిర్వహణ, విద్యుత్ ఉత్పత్తి తీరుపై అధికారులు ఏర్పాటు చేసిన ప్రత్యేక పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను తిలకించారు. 20 వేల మెగావాట్లకు చేరిన విద్యుత్ డిమాండ్ అనంతరం మీడియాతో మాట్లాడిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్రంలో విద్యుత్ వినియోగం అనూహ్యంగా పెరిగి సరికొత్త రికార్డులను తాకుతోందని తెలిపారు. గతంలో ఇదే సమయంలో రాష్ట్రంలో గరిష్ట విద్యుత్ డిమాండ్ (పీక్ డిమాండ్) 15,000 మెగావాట్లుగా ఉండగా, ప్రస్తుతం అది ఏకంగా 20,000 మెగావాట్లకు చేరుకుందని వెల్లడించారు. ఎల్‌నినో ప్రభావం, తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా జల విద్యుత్ ఉత్పత్తి సుమారు 4,000 మెగావాట్ల మేర తగ్గిందని, పెరిగిన డిమాండ్ , తగ్గిన ఉత్పత్తిని కలిపి విద్యుత్ వ్యవస్థపై మొత్తంగా 8,000 మెగావాట్ల అదనపు భారం పడిందని వివరించారు.

వ్యవస్థపై ఇంతటి భారీ భారం పడినప్పటికీ, రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్ కోతలు లేకుండా సమర్థవంతంగా నిర్వహణ సాగిస్తున్నామని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. ముఖ్యంగా గృహ వినియోగదారులకు 24 గంటల పాటు ఎలాంటి అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నామని చెప్పారు. జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గినా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా విద్యుత్‌ను సమకూర్చుకుంటూ ప్రజలకు ఇబ్బంది కలగకుండా ట్రాన్స్‌కో, ఎన్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ సంస్థలు అత్యంత సమర్థవంతంగా పనిచేస్తున్నాయని భట్టి విక్రమార్క అభినందించారు.

రాష్ట్రంలో ఒకవైపు కరెంట్ కోతలు..

మరోవైపు కరెంటు బిల్లులతో వాతలు..

మాజీ మంత్రి హరీశ్ రావు



హైదరాబాద్,అక్టోబర్,06: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, విద్యుత్ రంగ వైఫల్యాలపై బీఆర్ఎస్ పార్టీ తీవ్ర స్థాయిలో మండిపడింది. దసరా, దీపావళి పండుగల వేళ ప్రజలకు శుభవార్తలు చెప్పాల్సింది పోయి, ట్రూ-అప్ ఛార్జీల పేరుతో ఏకంగా రూ.5,420 కోట్ల భారాన్ని ప్రజల నెత్తిన రుద్దాలని ప్రభుత్వం కుట్ర పన్నుతోందని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. ఒకవైపు కరెంట్ కోతలు, మరోవైపు భారీ విద్యుత్ బిల్లులతో ప్రజల నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ హయాంలో గతంలో రూ.12,700 కోట్లకు పైగా ట్రూ-అప్ ఛార్జీలు వేయాలని ఈఆర్సీ సూచించినా, ప్రజలపై ఆ ఆర్థిక భారాన్ని మోపడానికి కేసీఆర్ ఎప్పుడూ అనుమతించలేదని గుర్తుచేశారు. రాష్ట్రంలో ప్రస్తుత విద్యుత్ సంక్షోభానికి కాంగ్రెస్ ప్రభుత్వ నిర్వహణ లోపాలు, సంపూర్ణ నిర్లక్ష్యమే కారణమని హరీశ్ రావు స్పష్టం చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రూ.91 వేల కోట్లతో విద్యుత్ రంగాన్ని బలోపేతం చేసి,సబ్ స్టేషన్లను, ఉత్పాదక సామర్థ్యాన్ని గణనీయంగా పెంచి 24గంటల నిరంతర నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను అందించామని తెలిపారు. కానీ నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బొగ్గు నిల్వలు, రిజర్వాయర్లలో నీటిని సద్వినియోగం చేసుకోలేక విద్యుత్ ఉత్పత్తిని పూర్తిగా దెబ్బతీశారని ఆరోపించారు. సరైన నిర్వహణ లేక థర్మల్ ప్లాంట్లు మూతపడుతున్నాయని, కరెంట్ సరఫరా లేక రైతులు పొలాల వద్ద పడిగాపులు కాస్తూ పాము కాట్లకు గురై ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ప్రకృతి తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ తెచ్చినకరువు అని ఆయన తీవ్రంగా విమర్శించారు. చాలదన్నట్లుగా వేల కోట్ల విలువైన ట్రాన్స్‌కో, జెన్‌కోలను ప్రైవేటుపరం చేసేందుకు ప్రభుత్వం కుట్రలు చేస్తోందని దుయ్యబట్టారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ పబ్లిక్ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తారని, కానీ ఇక్కడ కాంగ్రెస్ సర్కార్ మాత్రం ప్రభుత్వ సంస్థలను అమ్మకానికి పెడుతోందని ఎద్దేవా చేశారు. తక్షణమే ట్రూ-అప్ ఛార్జీల పేరుతో ప్రజలపై మోపుతున్న రూ.5,420 కోట్ల భారాన్ని పూర్తిగా ఉపసంహరించుకోవాలని, ఈ మొత్తాన్ని ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. ప్రజా వ్యతిరేక తుగ్లక్ నిర్ణయాలను వెనక్కి తీసుకునే వరకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మార్గదర్శనంలో పెద్దఎత్తున ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఇందిరమ్మ టవర్స్ కాంట్రాక్టర్లకు

ప్రత్యేక ప్రోత్సాహకాలు

ఆన్‌లైన్‌లో పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక..: మంత్రి పొంగులేటి



హైదరాబాద్, అక్టోబరు 6 : సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచనల మేరకు ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం చేపట్టామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు.మంగళవారం హైదరాబాద్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఇందిరమ్మ టవర్స్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడారు. ఏడాదిలోపే వీటిని పూర్తి చేసి లబ్ధిదారులకు తాళాలు ఇస్తామని తెలిపారు. ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం వేగవంతం చేసే కాంట్రాక్టర్లకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇస్తామని చెప్పుకొచ్చారు. ఒక నెల ముందుగా పూర్తి చేస్తే రూ.45 లక్షలు, రెండు నెలల ముందుగా పూర్తి చేస్తే రూ.90 లక్షల ప్రోత్సాహకం అందిస్తామని పేర్కొన్నారు .కుత్బుల్లాపూర్ గాజుల రామారంలో ఇళ్ల కోసం 7 వేల మందికి పైగా దరఖాస్తు చేశారని.. వీరిలో 5,218 మందిని అర్హులుగా గుర్తించామని మంత్రి పొంగులేటి తెలిపారు. బహిరంగ లక్కీ డ్రా ద్వారా 480 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఆన్‌లైన్‌లో పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేశామని స్పష్టం చేశారు. కుత్బుల్లాపూర్‌లో మూడు విడతల్లో మరిన్ని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేస్తామని వివరించారు. ప్రస్తుతం 7.5 ఎకరాల స్థలం అందుబాటులో ఉందని చెప్పుకొచ్చారు.ఇతర ప్రభుత్వ, హౌసింగ్ శాఖ భూములను గుర్తించి ఇళ్ల నిర్మాణం చేపడతామని పొంగులేటి అన్నారు. ఈ ఇళ్ల నిర్మాణం లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని ఉద్ఘాటించారు. లబ్ధిదారులు నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని అధికారులకు సూచించా రు. పేదల సొంతింటి కలను కార్యరూపంలోకి తెస్తున్నామని అన్నారు. 23 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిరంతర ప్రక్రియగా ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం చేపడుతున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

కోట్ల ఓటర్ల లెక్క ఇదే.. ఫేక్ ఓటర్లకు

సపోర్ట్ ఎందుకు? కాంగ్రెస్‌కు బీజేపీ ప్రశ్నలు..



న్యూఢిల్లీ,అక్టోబర్,06:దేశవ్యాప్తంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పేరుతో కేంద్ర ఎన్నికల సంఘం అవకతవకలకు పాల్పడిందని, జజుజ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు తీవ్రంగా డిమాండ్ చేస్తున్నాయి. 13 కోట్ల మంది ఓటర్లను ఎన్నికల సంఘం తొలగించిందని ఆరోపిస్తున్నాయి. ఈ ఓటర్లను మళ్లీ జాబితాలో చేర్చాలని 2025కు ముందున్న ఓటర్ జాబితానే కొనసాగించాలని కాంగ్రెస్, కాక్రోచ్ జనతా పార్టీలు కోరుతున్నాయి. ఈ 13 కోట్ల ఓటర్ల వివరాలను బీజేపీ క్లియర్‌గా వివరించింది. ఆ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి సుధాన్షు త్రివేది మాట్లాడుతూ.. ఈ 13 కోట్ల మందిలో మరణించిన వారు, నివాసం మారిన వారు, ఆచూకీ లభించని వారు ఉన్నారని చెప్పారు. ఎన్నికల సంఘం గణాంకాలను ఉటంకిస్తూ.. 2.8 కోట్ల మంది మరణించారని, 6.3 కోట్ల మంది నివాసం మారారని, 1 కోటి మంది డూప్లికేట్ ఓటర్లు అని, 3 కోట్ల మంది ఆచూకీ లభించలేదని చెప్పారు. నకిలీ ఓటర్లను కాపాడాలని కాంగ్రెస్ అనుకుంటోందా? అని త్రివేది ప్రశ్నించారు. ఇలా చేయడం ద్వారా కాంగ్రెస్ ఎవరికి మేలు చేయాలని అనుకుంటోంది? అని అడిగారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నివేదికలో.. గత 10 నెలల్లో ఎన్నికల కమిషనర్లు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషిలు ఎన్నికల కమిషన్ నిర్ణయాలను 14 సార్లు వ్యతిరేకించారని చెప్పింది.

దీంతో ఒక్కసారిగా వివాదం మొదలైంది. ప్రధాన ఎన్నిక కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, మోడీ ప్రభుత్వానికి సహకరించేలా పనిచేస్తున్నారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. తొలగించిన 1.3 కోట్ల ఓటర్లను వెంటన పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తోంది.

ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డికి బెయిల్ మంజూరు

హైదరాబాద్, అక్టోబరు 6 : ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డికి ఉప్పరపల్లి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. లైంగిక వేధింపుల కేసులో అతడిని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. 67 రోజులపాటు జైల్లో ఉదయ్ కృష్ణారెడ్డి ఉన్నారు. న్యాయస్థానం మంగళవారం అతడికి బెయిల్ మంజూరు చేయడంతో విడుదలయ్యారు. రూ. 25 వేల చొప్పున రెండు పూచీకతులతో బెయిల్ మంజూరు చేసింది. ప్రతి ఆదివారం పోలీసుల ఎదుట హాజరుకావాలని కోర్టు ఆదేశించింది. జాతీయ పోలీసు అకాడమీలో వేధింపులకు పాల్పడ్డారని మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా జులై 18వ తేదీన అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు.అనంతరం ఉదయ్ కృష్ణారెడ్డిని అరెస్ట్ చేసి ఉప్పరపల్లి కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసు విచారణ తర్వాత న్యాయస్థానం అతడికి జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. అప్పటినుంచి ఉదయ్ కృష్ణారెడ్డి చర్లపల్లి జైల్లోనే రిమాండ్ ఖైదీగా ఉంటున్నారు. ఈరోజు న్యాయస్థానం



షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేయడంతో అతను విడుదలయ్యారు.

ఓట్ల తొలగింపుపై ప్రశ్నిస్తే అరెస్టులా?

- రాహుల్, ప్రియాంకల అరెస్టు అప్రజాస్వామికం

మంత్రి పొన్నం ప్రభాకర్



కోహెడ: ప్రజాస్వామ్యంలో ఓటు అనేది ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కని, దాన్ని కాలరాయాలని చూస్తే చూస్తూ ఊరుకోబోమని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. సిద్దిపేట జిల్లా కోహెడ మండలం శ్రీరాములపల్లిలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ? ఓటర్ల జాబితా సవరణ పేరిట గ్రామీణ ప్రాంతాల్లోని పేదలు, అర్హులైన ఓట్లను అక్రమంగా తొలగిస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఎన్నికల కమిషన్ స్వతంత్రంగా వ్యవహరించకుండా కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లో పనిచేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని విమర్శించారు. ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు, ఈసీ అక్రమాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను పోలీసులు అరెస్టు చేయడాన్ని మంత్రి తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళన చేసే హక్కును కూడా కేంద్రం లాక్కుంటోందని ధ్వజమెత్తారు. దేశవ్యాప్తంగా ప్రతిపక్షాలు ముక్తకంఠంతో ఈసీ వైఖరిని ఎండగడుతున్నా మోదీ సర్కారు నిరంకుశంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. గ్రామీణ స్థాయి నుంచి ప్రతి ఓటరు హక్కును కాపాడేందుకు ‘దేశ్ బచావో.. ఓట్ బచావో’ పేరిట పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

100 కోట్ల ప్రయాణాలతో ‘స్త్రీ శక్తి’

చారిత్రాత్మక ఘనత.. చంద్రబాబు హర్షం

అమరావతి,అక్టోబర్,06:ఆంధ్రప్రదేశ్‌లో మహిళల కోసం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ‘స్త్రీశక్తి’ పథకం చారిత్రాత్మక మైలురాయిని చేరుకుంది. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా మహిళలు 100 కోట్లకు పైగా ఉచిత బస్సు ప్రయాణాలు పూర్తి చేసుకున్నారు. ఈ ఘనత పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ఆడబిడ్డల ఆదరణ, మాతృమూర్తుల ఆమోదంతోనే ఈ విజయం సాధ్యమైందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, “గత ఏడాది ఆగస్టు 15న ప్రారంభమైన స్త్రీశక్తి పథకం, 100 కోట్లకు పైగా ఉచిత ప్రయాణాలను పూర్తి చేసుకోవడం ఎంతో గర్వకారణం. రోజుకు నగటున 24 లక్షల మంది మహిళలు ఈ నదుపాయాన్ని వినియోగించుకుంటున్నారంటే ఈ పథకం వారి జీవితాల్లో ఎంతగా భాగమైపోయిందో అర్థమవుతోంది” అని తెలిపారు. చదువుకునే విద్యార్థినులు, ఉద్యోగాలకు వెళ్లే మహిళలు, రోజువారీ ఉపాధి కోసం ప్రయాణించే వారికి ఉచిత బస్సు ప్రయాణం ఎంతో శక్తినిచ్చిందని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రయాణ ఖర్చుల భారాన్ని తగ్గించి, తమ అవసరాల కోసం స్వేచ్ఛగా ప్రయాణించే భరోసాను ఈ పథకం అందిస్తోందన్నారు. ఇప్పటివరకు ఈ పథకం ద్వారా మహిళలు రూ.3,550 కోట్ల మేర ఆదా చేసుకున్నారని, ఇలా ఆదా అయిన ప్రతి రూపాయి వారి పిల్లల చదువుకు, కుటుంబ అవసరాలకు ఉపయోగపడాలన్నదే తమ ప్రభుత్వ ఆకాంక్ష అని ముఖ్యమంత్రి వివరించారు. ఈ చారిత్రాత్మక విజయాన్ని సాధ్యం చేసినందుకు రాష్ట్రంలోని మహిళలందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా, పథకం విజయవంతం కావడంలో అహర్నిశలు కృషి చేసిన ఆర్టీసీ యాజమాన్యానికి, సిబ్బందికి చంద్రబాబు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

హోర్మూజ్‌లో నౌకపై దాడి..

11 మంది భారతీయ నావికులకు గాయాలు



హోర్మూజ్ జలసంధిలో మరోసారి భారతీయ నావికులు ఉన్న నౌకపై దాడి జరిగింది. పనామా జెండా కలిగిన ఎంటీ ఆన్ పీస్ నౌకపై మంగళవారం ఒక ప్రొజెక్టైల్‌తో దాడి జరిగింది. ఈ దాడిలో గాయపడిన 12 మంది సిబ్బందిలో 11 మంది భారతీయులే ఉన్నట్లు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ ఘటన చోటుచేసుకుంది.

గాయపడిన నావికుల్ని ఒమన్ అధికారుల సహాయంతో నౌక నుంచి తరలించి ఖసబ్ ప్రాంతంలోని ఆస్పత్రికి తరలించారు. నౌకలో 17 మంది భారతీయులతో సహా మొత్తం 19 మంది సిబ్బంది ఉన్నారు.వాణిజ్య నౌకపై జరిగిన దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. భారతీయ నావికుల్ని తరలించడానికి సహకరించిన ఒమన్ అధికారులకు విదేశాంగ మంత్రిత్వ శాఖ థాంక్స్ తెలిపింది. హోర్మూజ్ ప్రాంతంలో వాణిజ్య నౌకలు, పౌర మౌలిక సదుపాయాలపై కొనసాగుతున్న దాడులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని భారత్ పేర్కొం ది. అంతర్జాతీయ జలాల్లో నౌక ప్రయాణాలు, వాణిజ్య కార్యకలాపాలను పునరుద్ధరించేందుకు ఈ దాడుల్ని తక్షణమే నిలిపేయాలని పిలుపునిచ్చింది. హోర్మూజ్ జలసంధి చుట్టుపక్కల ప్రాంతాల్లో వాణిజ్య నౌకలపై ఇటీవల కాలంలో దాడులు పెరిగాయి. అక్టోబర్ మొదటి వారంలోనే 7 ట్యాంకర్లు దాడులకు గురయ్యాయి. ఇరాన్-అమెరికా శాంతి చర్చలు విఫలమైన తర్వాత, అమెరికా జలసంధిని దిగ్బంధించిన నేపథ్యంలో నౌకలపై దాడులు పెరిగాయి.

భీంగల్ పోలీస్ స్టేషన్ ఎదుట యువకుడి ఆత్మహత్య యత్నం ఆస్పత్రిలో మృతి :భీంగల్ లో ఉద్రిక్తత

ఆర్మూర్ విలేఖరి అక్టోబర్ 06 (డీకే చాటింపు): భీంగల్ పోలీస్ స్టేషన్ ఎదుట యువకుడి ఆత్మహత్య యత్నం ఘటనలో మంగళ వారం ఉదయం జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. ఇదిలా ఉండగా ఆత్మహత్యకు పోలీసులే కరణం అంటూ ఆరోపణలు రాగా మా పోలీసుల తప్పు లేదని కమిషనర్ తెలిపారు. భీంగల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో సుధాకర్ అనే టీ కొట్టు వ్యక్తి పెట్రోల్ బాటిల్ అగ్గిపెట్టె తీసుకొని వచ్చి తన ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. జరిగిన దానిలో పోలీస్ వారి తప్పు ఏమిలేదు అని పోలీస్ కమీషనర్ వెల్లడించారు. మంగళవారం ఉదయం యువకుడు మరణించడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కుమార్, నిజామాబాద్ ఆస్పత్రి మార్చురీ వద్దకు చేరుకోగానే ఒక్కసారి ఉద్రిక్తత చోటు చేసుకుంది.అమాయకుడైన యువకుడు వేధింపులకు బలి అయ్యాడని నిలదీయడం,బంధువులు,పార్టీ శ్రేణులు అక్కడికి చేరుకోవడంతో, బీజేపీ అధ్యక్షుడిని అక్కడినుండి తీసుకొని వెళ్లి అరెస్ట్ చేశారు.యువకుడు మరణం



తెలుసుకున్న బాల్కొండ ఎమ్మెల్యే భీమ్గల్ కు బయల్దేరగ హైదరాబాద్ లో అడ్డుకొని నిర్బంధించారు. యువకుడి మృతి పై విచారణ చేపట్టాలని,బాధిత కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఓటు బచావో..దేశ్ బచావో" సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను భర్తరఫ్ చేయాలి

-సర్ ప్రక్రియపై ఇండియా కూటమి ఆగ్రహం... -నారాయణపేటలో భారీ ధర్నా... -"ఓటు బచావో..దేశ్ బచావో" నినాదంతో కలెక్టరేట్ వరకు సాగిన ర్యాలీ... -కలెక్టరేట్ ఏవోకు వినతి పత్రం అందజేత... -కదం తొక్కిన కామ్రేడ్లు, నేతలు...





నారాయణపేట,(డీకే చాటింపు): ఓటు బచావో..దేశ్ బచావో".. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ ఆరోపిస్తూ ఆయనను వెంటనే పదవి నుంచి భర్తరఫ్ చేయాలని ఇండియా కూటమి నాయకులు డిమాండ్ చేశారు.ఇండియా కూటమి పిలుపు మేరకు దేశవ్యాప్తంగా చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా మంగళవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని నర్సిరెడ్డి చౌరస్తాలో "ఓటు హక్కు పరిరక్షణ కోసం పోరాడుదాం" అంటూ కాంగ్రెస్,సీపీఐ,సీపీఐ (ఎం),సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీల ఆధ్వర్యంలో భారీ ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కె.ప్రశాంత్ కుమార్ రెడ్డి,సీపీఐ నాయకులు నర్సింహా,సీపీఐ (ఎం)నాయకులు వెంకట్రాంరెడ్డి,సీపీఐ(ఎంఎల్) నాయకులు హన్మేష్ చారి, బి.రాము,కే.కాశినాథ్ మాట్లాడుతూ సర్ ప్రక్రియ పేరుతో అర్హులైన ఓటర్ల హక్కులకు ఎలాంటి నష్టం కలగకుండా ఎన్నికల సంఘం పూర్తి పారదర్శకతతో వ్యవహరించాలని డిమాండ్ చేశారు.ఎన్నికల సంఘం స్వతంత్ర రాజ్యాంగ సంస్థగా నిష్పక్షపాతంగా పనిచేయాల్సిన బాధ్యత ఉందన్నారు.చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఆయనను వెంటనే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.సర్ ప్రక్రియపై ప్రజల్లో ఉన్న అనుమానాలను ఎన్నికల సంఘం నివృత్తి చేయాలని కోరారు. దశాబ్దాలుగా ఓటు హక్కును వినియోగించుకుంటున్న పౌరులను పాత రికార్డులు, పూర్వీకుల వివరాల పేరుతో ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు.నోటీసులు జారీ చేసిన ప్రతి ఓటరుకు తన వాదనను వినిపించే అవకాశం కల్పించాలని కోరారు.ఓటర్ల జాబితా నుంచి పేరు తొలగించే ముందు కారణాలను స్పష్టంగా తెలియజేయాలని, ఫారం-6,ఫారం-7 ప్రక్రియలను నిబంధనల ప్రకారం,పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని డిమాండ్ చేశారు.గ్రామసభలు,వార్డు సభల ద్వారా ఓటర్ల తొలగింపులకు సంబంధించిన కారణాలను ప్రజలకు బహిరంగంగా తెలియజేయాలని కోరారు. అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి అన్యాయంగా తొలగిపోకూడదని స్పష్టం చేశారు.ఓటు హక్కు కేవలం ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం మాత్రమే కాదని, అది ప్రజాస్వామ్యంలో పౌరుడి గొంతుక అని వారు పేర్కొన్నారు.ప్రజల ఓటు హక్కును పరిరక్షించేందుకు ఇండియా కూటమి ఐక్యంగా పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు.ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో నమ్మకం నిలవాలంటే ఎన్నికల సంఘం ప్రతి చర్యలో పారదర్శకత పాటించాల్సిందేనన్నారు.సర్ పై ప్రజల సందేహాలను నివృత్తి చేసి,అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును రక్షించాలని డిమాండ్ చేశారు .ధర్నా అనంతరం ఇండియా కూటమి నాయకులు, కార్యకర్తలు నర్సిరెడ్డి చౌరస్తా నుంచి పాత బస్టాండ్ మీదుగా జిల్లా కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ''ఓటు బచావో..దేశ్ బచావో'', "ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి"అంటూ నినాదాలు చేశారు. అనంతరం కలెక్టరేట్‌కు చేరుకున్న కూటమి ప్రతినిధులు కలెక్టరేట్ ఏవో అనిల్ కుమార్‌కు ఓ వినతి పత్రాన్ని అందజేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల హక్కులను కాపాడాలని,ఓటర్ల జాబితా సవరణలో పారదర్శకత పాటించాలని,ఎన్నికల సంఘం స్వతంత్రతను కాపాడాలని ఆ వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్)మాస్ లైన్ పార్టీ నాయకులు జయలక్ష్మి, చెన్నారెడ్డి,కొండ నర్సింలు, రాము,కెంచ నారాయణ, నరసింహ,నారాయణ,హాజీ, ప్రశాంత్,సాదిక్ నలీం,వెంకట రాములు,వెంకటేష్,కాంగ్రెస్ నేతలు బండి వేణుగోపాల్, మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షులు ఏ.కాంత్ కుమార్,ఎండి సలీం,సిపిఎం నాయకులు గోపాల్, బలరాం,అంజిలయ్య,సిపిఐ నాయకులు నరసింహ, కాంగ్రెస్,సిపిఎం,సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ కార్యకర్తలు,ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ షాక్ తో మహిళ మృతి

-నారాయణపేట మండలం కోటకొండ గ్రామంలో విషాదఛాయలు... -బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తుల వినతి...

నారాయణపేట,(డీకే చాటింపు): వ్యవసాయ పొలం దగ్గర విద్యుత్ షాకుతో ఓ వయోవృద్ధురాలు మృతి చెందారు. ఈ సంఘటననారాయణపేట మండలం కోటకొండ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. ఆ గ్రామస్తుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కోటకొండ గ్రామానికి చెందిన సిరిగి నరసమ్మ రోజువారి మాదిరిగా మంగళవారం ఉదయం తమ వ్యవసాయ పొలానికి వెళ్లారు.పొలంలో విద్యుత్తు స్టార్టర్ దగ్గర గడ్డి కోస్తున్న సమయంలో అక్కడే కిందపడి ఉన్న విద్యుత్ వైర్ తగలడంతో విద్యుత్ షాకుకు గురై ప్రమాదవశాత్తుగా అక్కడికక్కడే ఆమె మృతి చెందారు.కుటుంబంలో పెద్దది దిక్కుగా ఉన్న నరసమ్మ విద్యుత్ షాకుకు గురై మృతి చెందడంతో వారి కుటుంబంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి,. చనిపోయిన నరసమ్మకు ఇద్దరు కొడుకులు,ఒక కూతురు,ఇద్దరు కొడుకులు గొర్ల మందును కాసేందుకు ఇతర జిల్లాలకు



వలస వెళ్లారు.విద్యుత్ షాక్ తో మృతి చెందిన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాల్సిందిగా కోటకొండ గ్రామ ప్రజలు కోరుతున్నారు.

అండర్-15 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు శ్రీనిధి ఎంపిక

-క్రీడల ఆణిముత్యాన్ని సన్మానించిన కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ భీమయ్య ముదిరాజ్... -హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్ సి ఏ) అండర్-15 బాలికల రాష్ట్ర స్థాయి ప్రాబబుల్స్‌కు ఎంపిక...

నారాయణపేట,(డీకే చాటింపు): అండర్-15 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన నారాయణపేట జిల్లా కేంద్రానికి చెందిన జంగిటి శ్రీనిధిని నారాయణపేట మున్సిపాలిటీ మూడోవ వార్డు కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ భీమయ్య ముదిరాజ్ శాలువా, పూలమాలతో మంగళవారం ఘనంగా సత్కరించారు. నారాయణపేట పట్టణంలోని మూడోవ వార్డుకు చెందిన జింగిటి శ్రీనిధి పట్టణంలోని బ్రిలియంట్ గ్రామర్ పాఠశాల లో 9వ,తరగతి చదువుతున్న విద్యార్థిని (క్రికెట్ క్రీడాకారిణి)జె.శ్రీనిధి హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్ సి ఏ) అండర్-15 బాలికల రాష్ట్ర స్థాయి ప్రాబబుల్స్‌కు ఎంపికయ్యారు.ఈ నేపథ్యంలో కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ వార్డు ప్రజలతో కలిసి జంగిటి శ్రీనిధి ని శాలువా,పూలమాలలతో సత్కరించి మిఠాయి తినిపించి అభినందించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ భీమయ్య మాట్లాడుతూ చిన్న వయసులోనే క్రికెట్‌లో ప్రతిభ కనబరుస్తూ రాష్ట్ర స్థాయి పోటీలకు జంగిటి శ్రీనిధి ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు.శ్రీనిధి క్రీడల్లో రాణించేందుకు ప్రోత్సహించిన తల్లిదండ్రులకు,క్రీడ కోచ్ లకు ఈ సందర్భంగా ఆమె కృతజ్ఞతలు తెలిపారు.చిన్న వయసులోనే శ్రీనిధి రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక కావడం నారాయణపేటకు ఎంతో గర్వకారణమని ఆమె పేర్కొన్నారు. నారాయణపేటకు క్రీడల్లో ఎంతో ప్రాముఖ్యత ఉందని, శ్రీనిధి రాష్ట్రస్థాయి పోటీల ద్వారా నారాయణపేటకు



మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. విద్యార్థిని శ్రీనిధి చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరచడం అభినందనీయమని, భవిష్యత్తులో శ్రీనిధి మరింత ఉన్నత స్థాయికి చేరుకొని తల్లిదండ్రులకు, నారాయణపేటకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు.ముదిరాజు ముద్దుబిడ్డ శ్రీనిధి సాధించిన ఈ ఘనత నారాయణపేటలోని ఇతర విద్యార్థినిలకు స్ఫూర్తినిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జంగిటి శ్రీనిధి తల్లిదండ్రులు జంగిటి రమేష్,లత,డాక్టరేట్ కాకర్ల భీమయ్య,వార్డు ప్రజలు జంగిటి రవి కుమార్(అట్టు), తిమ్మయ్య,గడ్డమీది రాము, శివ,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కదం తొక్కిన కామ్రేడ్లు.. కాంగ్రెస్ శ్రేణులు..!

-నారాయణపేటలో ధర్నా, ర్యాలీ... -కదిలి వచ్చిన పలువురు కామ్రేడ్లు...! గాంధీ టోపీలతో దర్శనమిచ్చిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు...



నారాయణపేట,(డీకే చాటింపు): కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పిలుపు మేరకు..ఏఐసీసీ ఆదేశాలానుసారం నారాయణపేట గడ్డపై నిర్వహించిన"ఓట్ బచావో – దేశ్ బచావో"మహా ధర్నా, నిరసన ర్యాలీ కార్యక్రమంలో కాంగ్రెస్,వామపక్ష పార్టీలు కదం తొక్కారు.!ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం సాగుతున్న ఒక మహా పోరాట శంఖారావం జిల్లా కేంద్రంలో మంగళవారం మారుమోగింది.ప్రతి నినాదం పాలకుల వెన్నులో వణుకు పుట్టించింది..!ఈ దేశంలో ఓటు హక్కును అపహాస్యం చేస్తూ,ప్రజాస్వామ్య వ్యవస్థలను అణగదొక్కాలని చూస్తున్న దుర్మార్గపు శక్తుల ఆటలు ఇక సాగవని ఈ సందర్భంగా ఆయా పార్టీల నేతలు నినాదించారు.ఈ దేశం మనది..మన ఓటు మన బలం కానీ,ఆ ఓటు హక్కునే కాలరాసేలా కుట్రలు పన్నుతుంటే చూస్తూ ఊరుకోవాలా రాజ్యాంగం కల్పించిన పవిత్రమైన ఓటు హక్కును కాపాడుకోవడానికి, దేశాన్ని వినాశనం నుంచి రక్షించడానికి కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు.రాహుల్ గాంధీ స్పష్టంగా హెచ్చరించినట్లుగా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే ప్రతి ఒక్కరికీ భవిష్యత్తులో ప్రజలే తగిన తరిమి కొట్టే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. డిసిసి అధ్యక్షులు కే.ప్రశాంత్ కుమార్ రెడ్డి నాయత్వంలో కదం తొక్కిన కాంగ్రెస్, వామపక్ష పార్టీల శ్రేణుల జోరు అందర్నీ విశేషంగా ఆకట్టుకుంది.కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రత్యేకంగా గాంధీ టోపీలు ధరించి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే వామపక్ష నేతలు అన్మేష్ చారి,బి.రాము,కే కాశీనాథ్,జి.వెంకట రామారెడ్డి,బి.బలరాం తదితరులు పాల్గొని ప్రసంగించారు.డిసిసి ఉపాధ్యక్షులు,జిల్లా ప్రధాన కార్యదర్శులు,కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు,ఎన్నీ సెల్ నాయకులు,సీపీఐ,సీపీఐ (ఎంఎల్)మిత్రపక్షాలు, మండలాల అధ్యక్షులు తదితరులు అంకితభావంతో ఈ పోరాటంలో సైనికులై కదిలారు.ఓట్ల తొలగింపు పేరుతో గ్రామాల్లో,పట్టణాల్లో పేదలను,ప్రజలను మోసం చేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కుట్రలను ఇక్కడితో అంతం చేయాల్సిందే.కుట్రదారులు ఎవరైనా సరే వారి ఆటలు ఇక చెల్లవు అని హెచ్చరించారు. ఈ ఓటు చోరీ పాలనకు చరమగీతం,ఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసే వరకు ఎన్నికల అధికారిని తొలగించే వరకు మన పోరు ఆగదని ఆయా పార్టీల నేతలు స్పష్టం చేశారు.ఓట్ బచావో..దేశ్ బచావో అని నినాదించారు.

వర్షాభావంతో అల్లాడుతున్న రైతులకు జనసేన అండ

-రైతన్నల కష్టాలను తెలుసుకుని భరోసా -ప్రభుత్వం రైతుల పక్షాన నిలుస్తుందని హామీ



కొడుమూరు: సకాలంలో వర్షాలు కురవక పంటలు ఎండిపోతుండటంతో తీవ్ర ఆందోళనలో ఉన్న రైతులను కోడుమూరు నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు సంధ్యా విక్రమ్ కుమార్ సోమవారం పరామర్శించారు. కోడుమూరు మండలం వర్కూరు గ్రామానికి చెందిన రైతు లక్ష్మన్న వ్యవసాయ పొలాన్ని సందర్శించిన ఆయన, పంటల పరిస్థితిని స్వయంగా పరిశీలించి రైతులతో మాట్లాడారు. పొలాల్లో నెలకొన్న పరిస్థితులను క్షుణ్ణంగా గమనిస్తూ, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, సాగులో ఎదురవుతున్న ఇబ్బందులు, పెట్టుబడులు, దిగుబడులపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.ఇటీవల వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో మొలకెత్తిన పంటలు ఎదుగుదల లేక ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే విత్తనాలు, ఎరువులు, మందులు, కూలీల కోసం లక్షల రూపాయలు ఖర్చు చేశామని, కానీ వర్షాభావంతో పంటలు దెబ్బతింటుండటంతో తీవ్ర ఆర్థిక నష్టాలు ఎదుర్కొంటున్నామని తెలిపారు. బోర్లు, చెరువుల్లో కూడా నీటి మట్టం తగ్గిపోవడంతో పంటలను కాపాడుకోవడం కష్టంగా మారిందని రైతులు వాపోయారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, వ్యవసాయం పూర్తిగా ప్రకృతిపైనే ఆధారపడి ఉంటుందని, వర్షాలు లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందనే నమ్మకం తమకు ఉందన్నారు. ప్రభుత్వం తమ సమస్యలను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.రైతుల సమస్యలను ఓపికగా విన్న సంధ్యా విక్రమ్ కుమార్ మాట్లాడుతూ, రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రైతుల కష్టనుఖాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను ప్రభుత్వం నిరంతరం సమీక్షిస్తోందని, రైతులు నష్టపోకుండా అవసరమైన చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉందన్నారు.ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న పరిస్థితిని ప్రభుత్వం అత్యంత సానుభూతితో పరిశీలిస్తోందని, అవసరమైతే సంబంధిత అధికారుల ద్వారా క్షేత్రస్థాయిలో పంట నష్టాలను అంచనా వేసి రైతులకు తగిన సహాయం అందించే దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని, ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని భరోసా కల్పించారు.ప్రకృతి వైపరీత్యాలు రైతులను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని పేర్కొన్న ఆయన, ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో రైతులు ధైర్యంగా ఉండాలని సూచించారు. పంటలను కాపాడుకునేందుకు వ్యవసాయ శాఖ అధికారులు సూచించే శాస్త్రీయ సలహాలను పాటించాలని, అవసరమైన చోట ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు.వ్యవసాయం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని, రైతు బాగుంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని సంధ్యా విక్రమ్ కుమార్ అన్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వారికి అవసరమైన సహాయం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రైతుల సంక్షేమానికి జనసేన పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, ప్రతి రైతు సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా రైతులతో కలిసి పొలాల్లో తిరుగుతూ పంటల పరిస్థితిని పరిశీలించిన సంధ్యా విక్రమ్ కుమార్, వర్షాలు కురిసి రైతుల కష్టాలు తొలగిపోవాలని ఆకాంక్షించారు. గ్రామంలో పలువురు రైతులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకోవడంతో పాటు, భవిష్యత్తులో కూడా రైతులకు అందుబాటులో ఉంటానని తెలిపారు.ఈ కార్యక్రమంలో వర్కూరు జనసేన నాయకులు నాగరాజు, అశోక్, లక్ష్మన్న, కోడుమూరు సీనియర్ జనసేన నాయకులు రాముడు, బాలు గౌడ్, చనగండ్ల మిన్నెల్లా, స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హస్తినాపురం నార్త్ ఎక్టెన్షన్ చౌరస్తాలో ట్రాన్స్‌ఫార్మర్ పేలుడు

బీజేపీ నాయకుల తక్షణ స్పందన

ఎల్బీనగర్, (ఊడీకె చాటింపు) హస్తినాపురం నార్త్ ఎక్టెన్షన్ చౌరస్తాలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను కస్తూరి కాలనీలోని నర్సింగ్ కళాశాలకు చెందిన బస్సు ఢీకొనడంతో ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోయింది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న విద్యార్థులకు తృటిలో పెను ప్రమాదం తప్పింది. ట్రాన్స్‌ఫార్మర్ పేలడంతో ఆయిల్ మొత్తం రోడ్డుపై పడటంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న వెంటనే బీజేపీ నాయకులు స్పందించి, కాలనీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి గారు విద్యుత్ శాఖ ఏఈ పర్వత గారికి ఫోన్ చేసి సమస్యను తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు ప్రారంభించారు. అదేవిధంగా రోడ్డుపై పడిన ఆయిల్ వల్ల వాహనాలు జారిపడే ప్రమాదం ఉండటంతో, అక్కడ మట్టి పోయించి ప్రమాద నివారణకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడు తూ, కళాశాల యాజమాన్యం తమ బస్సులను అత్యంత జాగ్రత్తగా నడిపిం చాలని, ప్రజల భద్రతకు ఎలాంటి ప్రమాదం కలగకుండా బాధ్యతాయు తంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, బైరామల్‌గూడ డివిజన్ బీజేపీ అధ్యక్షులు



ఎరుకల మల్లేష్ గౌడ్, జిల్లా ఓబీసీ కార్యవర్గ సభ్యులు బుర్రం ప్రకాష్ మరియు ఇతరులు పాల్గొన్నారు.

డీకే చాటింపు
తెలంగాణ దిన పత్రిక
బుధవారం,అక్టోబర్,7, 2026

రూపాయి ఎందుకు క్షీణిస్తోంది..?

డాలర్ పడిపోతున్న తరుణంలో ఆ డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ కూడా పడిపోవడం అంటే ఆర్థిక దారుణమేనా? డాలర్ బలంగా ఉండి అన్ని దేశాల కరెన్సీలు పడిపోతున్నాయి, ఆ క్రమంలో మన రూపాయి కూడా పడిపోతోందని అనుకున్నా ఒక అర్థం ఉంది.కానీ డాలర్ పతనం అవుతున్నా, మన రూపాయి విలువ పెరగక పోవడాన్ని ఏ విధంగా చూడాలి? అన్నదే చర్చగా ఉంది. అసలు ఈ విలువ పతనానికి కారణాలు విశ్లేషించడానికి ఆర్థిక నిపుణులకు ధైర్యం చాలడం లేదు. యూపీఏ హయాంలో మన్మోహన్ వంటి ఆర్థిక నిపుణుడు ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో.. రూపాయి విలువ పతనాన్ని అరికట్టేందుకు రిజర్వ్ బ్యాంకును రంగంలోకి దింపి విదేశీ కరెన్సీ విక్రయాలు చేసి రూపాయిని కాస్త బలం పుంజుకునేలా చేశారు. కనీసం పడిపోకుండా ఆపే ప్రయత్నం చేశారు. కానీ ప్రస్తుతం అలాంటి విధానాలను పట్టించుకోవడం లేదు. రూపాయి పతనం ఎంతో మంది జీవితాలపై వ్యాపారాలపై ప్రభావం చూపిస్తోంది. పాలకుల వద్ద దీనికి పరిష్కారం లేదు. దేశ ఆర్థిక వ్యవస్థ స్థైర్యాన్ని కొలిచే కీలక సూచీలో ఒకటి కరెన్సీ విలువ. అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్ల ఒత్తిడికి, దేశీయ విధాన పరమైన వైఫల్యాలకు, రాజకీయ–ఆర్థిక అనిశ్చితులకు రూపాయి బలి అవుతుండటం స్పష్టంగా కనిపిస్తోంది. మొన్న రూపాయి విలువ భారీగా పతనం అయింది. డాలర్‌తో పోలిస్తే 90 రూపాయలు క్షీణించి ఆల్ టైం రికార్డ్‌గా నమోదైంది. ఇది మరింతగా పెరిగే ప్రమాదం ఉందని అంటున్నారు. అయినా మన పాలకులు రూపాయి ఎందుకు పడిపోయిందో గుర్తించి కట్టడి చేయాలని ఎందుకు అనుకోరు? విదేశీ మదుపుదారులు స్టాక్, రుణ మార్కెట్ల నుంచి తమ పెట్టుబడులను వెనక్కి తీసుకుం టున్నారు. వాటిని ఇతర చోట్లకు తరలిస్తున్నారు. వారంతా డాలర్ల రూపంలోనే లావాదేవీలు చేస్తారు కాబట్టి డాలర్లకు డిమాండ్ పెరిగి రూపాయి విలువ తగ్గుతోంది. ట్రంప్ బెది రింపులు, వాణిజ్య పోరు వంటి అనేక సమస్యలు కూడా పలు దేశాల కరెన్సీల విలువ పతనానికి కారణం అవు తున్నాయి. మనపైనా అదే ప్రభావం చూపిస్తోంది. రూపాయి పతనాన్ని అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్‌బీఐ చెబుతున్నప్పటికీ అవన్నీ ఉత్తుత్తి ప్రయత్నాలే.. గతంలో రూపాయి పతనం అయిన ప్రతీసారి రిజర్వ్ బ్యాంక్ రంగంలోకి దిగి ఫారిన్ ఎక్స్చేంజ్‌ని మార్కెట్‌లో రిలీజ్ చేసి రూపాయి విలువ పతనం కాకుండా కాపాడేది. ఈ ఏడాది ఆగస్టు నాటికి ఆర్‌బీఐ మార్కెట్‌లో ఫారిన్ ఎక్స్చేంజ్‌గా విడుదల చేసే మొత్తం 11 బిలియన్ డాలర్లకు పడి పోయింది. ఆర్బీఐ విధానాన్ని పరోక్షంగా ప్రభుత్వ విధానంగా చెప్పుకోవాల్సి ఉంది. ప్రస్తుతం ఆర్బీఐ దగ్గర 684 బిలియన్ డాలర్ల ఫారిన్ ఎక్స్చేంజ్‌లు ఉన్నాయి. అయినా ఆర్‌బీఐ ఇప్పుడు జోక్యం చేసుకోవడం లేదు. ఈ రూపాయి విలువ పతనంలో ఆర్‌బీఐ చర్యలు తీసుకోలేక చేతులు ఎత్తేసింది. ఈ ఏడాది అక్టోబర్ 27తో పోలిస్తే ఇండియన్ రూపీ 3.5 శాతం పడిపోయింది. రూపాయి పతనం చెందుతున్నా కేంద్ర ప్రభుత్వం మాత్రం రివర్స్‌లో ఆలోచిస్తుంది. నిర్మలా సీతా రామన్ రూపాయి బలహీనపడ డం కాదు, డాలరే బలహీన పడుతుందని ప్రకటించారు. పైగా మన దేశ ఎకానమీ ఫండమెంటల్స్ బలంగా బాగానే ఉన్నాయి. గ్లోబల్ పరిస్థితుల వలన రూపాయి పడిపోతున్నదని వాదిస్తున్నారు. అదే నిజమైతే గ్లోబల్ గానే డాలర్ పరిస్థితి బాగా లేదు. డాలర్ కూడా పతనం చెందుతుంది. మరి ఇలాంటి సందర్భంలో మన రూపాయి విలువ ఎందుకు పడిపోతుందో చెప్పకుండా దాట వేస్తున్నా రు. డాలర్‌తో పోల్చినప్పుడు ఇతర దేశాల కరెన్సీ పెరుగు తుంటే, డాలర్ తగ్గుతుంటే ఇండియా రూపాయి మాత్రం ఎందుకు తగ్గుతోంది? దీనిని ప్రభుత్వం ఎందుకు ప్రస్తావిం చడం లేదు. ఎగుమతులు చేస్తే డాలర్లు వస్తాయి. దిగుమతుల వల్ల డాలర్లు రావు, డాలర్స్ సంపాదిస్తున్న దానికి ఖర్చు పెడుతున్న దానికి ఇన్ బ్యాలెన్స్ వల్లన డిమాండ్ సప్లై మిస్ మ్యాచ్ అయ్యి రూపాయి పతనం చెందుతుంది. ఈ అసమతుల్యత వల్ల కూడా రూపాయి పతనం అవుతోంది. డాలర్ విలువ పెరుగుతున్న ప్రతిసారీ, భారత్ చెల్లించాల్సిన ఇంధన బిల్లులు అమాంతం పెరుగుతాయి.

విలేకరులు కావలెను
రాజకీయ సంచలనాలకు ప్రతీకగా నిలిచిన
డీకే చాటింపు
తెలంగాణ దినపత్రిక
డీకే సారధ్యంలో చాటింపు దినపత్రికలో పనిచేయడానికి తెలంగాణాలోని అన్ని జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో పనిచేయడానికి ఆసక్తి, అనుభవం గల విలేకరులు కావలెను.
సంప్రదించండి :
సెల్ : 9603754136 - 7386287837

7న తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ నిజామాబాద్ రాక

బహిష్కరణ ఘటనలపై బాధితులతో భేటీ కానున్న చైర్మన్, సభ్యులు

కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడి

నిజామాబాద్ప్రతినిధి, అక్టోబర్06 (డీకే చాటింపు): జిల్లాలోని పలు ప్రాంతాలలో చోటు చేసుకుంటున్న సామాజిక బహిష్కరణ ఘటనలపై బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ ఈ నెల 7న బుధవారం నిజామాబాద్ పర్యటనకు విచ్చేయనుందని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, డా. బాల లక్ష్మీలు సాంఘిక బహిష్కరణకు గురైన బాధితులతో నేరుగా మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకోనున్నారని అన్నారు. ఈ నెల 7న నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు బాధితులతో కమిషన్ ప్రతినిధులు ఫిర్యాదులను స్వీకరిస్తారని తెలిపారు.



బాధితులు కమిషన్ చైర్మన్, సభ్యులను నేరుగా కలిసి విజ్ఞాపనలు, ఫిర్యాదులు అందజేయవచ్చని సూచించారు.

విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలి

ఉపాధ్యాయ దినోత్సవంలో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి పిలుపు



నిజామాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 06 (డీకే చాటింపు): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. సమాజ ప్రగతిలో గురువుల పాత్ర ఎంతో కీలకమైనందున అంకిత భావంతో విధులు నిర్వర్తిస్తూ ఉపాధ్యాయ వృత్తి గౌరవాన్ని మరింతగా ఇనుమ డింపజేయాలని హితవు పలికారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేయగా, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతిరెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి గురుపూజోత్సవానికి శ్రీకారం చుట్టిన అనంతరం, మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని ముఖ్య అతిథుల చేతుల మీదుగా శాలువాలు, జ్ఞాపికలను బహూకరించి ఘనంగా సన్మానించారు పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కోట్లాది రూపాయలను వెచ్చిస్తూ మెరుగుపరుస్తున్నారని తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా తెలంగాణా విద్యార్థులను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో వేల కోట్ల రూపాయలను వెచ్చిస్తూ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ళు, తెలంగాణ మోడల్ స్కూల్స్ లను ఏర్పాటు చేస్తున్నారని గుర్తు చేశారు. నాణ్యమైన భోజనం, ఏకరూప దుస్తులు, ఇతర అన్ని వసతులు కల్పిస్తోందని అన్నారు. ఒక్క నిజామాబాద్ జిల్లాలోనే ప్రభుత్వ బడులలో మరుగుదొడ్లు, మూత్రశాలల కోసం రూ.21 కోట్ల నిధులను వెచ్చించామని అన్నారు. ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా ఉపాధ్యాయులు సైతం విద్యార్థులలో మెరుగైన విద్య, విజ్ఞానాన్ని పెంపొందిస్తూ సమాజ ప్రగతికి దోహదపడాలని కోరారు. విద్యా రంగంలో నిజామాబాద్ జిల్లాను అగ్రభాగాన నిలిపేందుకు అంకిత భావంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, సులభంగా విద్యార్థులు ఆకళింపు చేసుకునే రీతిలో ఆధునిక పద్ధతుల్లో బోధన చేయాలని హితవు పలికారు. ఈ దిశగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎఫ్.ఎల్.ఎన్ విధానంపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. అంకితభావం, నిబద్ధతతో విధులు నిర్వర్తించే ఉపాధ్యాయులకు తప్పనిసరిగా తగిన గుర్తింపు లభిస్తుందని, అదే సమయంలో విధుల పట్ల అలసత్వ ధోరణిని ప్రదర్శించే వారిపై చర్యలు ఉంటాయని కలెక్టర్ స్పష్టం



చేశారు. హక్కులను కోరుకోవడంలో తప్పు లేదని, అదే సమయంలో బాధ్యతలను సైతం గుర్తెరిగి సమర్ధ వంతంగా నిర్వహించా లన్నారు. సమాజానికి ఉత్తమ పౌరులను అందించాల్సిన గురుతర బాధ్యత ఉ పాధ్యాయులపై ఉన్నందున బోధన విధులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని సూచించారు. మారుతున్న సామాజిక పరిస్థితులకు అనుగుణంగా సరికొత్త పద్ధతుల్లో విద్యను బోధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని ఘనంగా సత్కరించారు. సాంస్కృతిక ప్రదర్శనలతో అలరింపజేసిన బాలికలకు జ్ఞాపికలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి,రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, రాష్ట్ర గీత కార్మిక పారిశ్రామిక సంఘం చైర్మన్ శేఖర్ గౌడ్, జిల్లా విద్యా శాఖ అధికారి అశోక్, డీ.ఐ.ఈ.ఓ రవికుమార్, డీ.సీ.ఈ.బీ సెక్రెటరీ సీతయ్య, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అందుల పట్ల నిర్లక్ష్యం చేయొద్దు,

అంధ పాఠశాల జిల్లాకే తలమానికం

పేరెంట్స్ కమిటీ అభినందన

నిజామాబాద్ ప్రతినిధి అక్టోబర్ 06 (డీకే చాటింపు):నిజామాబాద్ నగరం లోనీ స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్స్ట్రక్షన్ నిర్వహించే అందుల ప్రత్యేక పాఠశాల తల్లిదండ్రుల సమావేశము మంగళవారం తారక రామ నగర్ లో ఏర్పాటు చేయడం జరిగినది. ఈ కార్యక్రమానికి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ అంధ విద్యార్థుల తల్లి దండ్రులు తమ పిల్లలు దివ్యాంగులని అశ్రద్ధ చేయకుండా వారిని జాగ్రత్తగా పెంచి, ఉపయోగ కర పౌరులుగా తీర్చిదిద్దాలని ఆయన కోరారు. అంద విద్యార్థులను తీర్చిదిద్దడంలో తల్లిదండ్రుల పాత్ర ఎంతగానో ఉ ంటుంది అని ఆయన తెలిపారు. ప్రధానంగా స్నేహ సొసైటీ యాజమాన్యం పిల్లల క్రమశిక్షణకు వారి అభ్యున్నతి కి చాలా కృషి చేస్తున్నదని తాను చాలా సంస్థల గురించి విన్నాను కానీ స్నేహ సొసైటీ వారిలా అంకితభావంతో పనిచేసే సంస్థలు సమాజంలో చాలా అరుదుగా కనిపిస్తాయ ని ఆయన తెలిపారు. స్నేహ సొసైటీలో అంద విద్యార్థులు మంచి ప్రగతిని సాధిస్తున్నార ని ఆయన ప్రశంసించారు. స్నేహ సొసైటీ కార్యదర్శి సూరి సిద్దయ్య అధ్యక్షత జరిగిన సమావేశంలో అంద విద్యార్థుల కోసం అందిస్తున్న సేవలను వివరించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అందుల ప్రత్యేక పాఠశాలలో ఏర్పాటు చేయవలసిన లోకల్ ప్రాజెక్ట్ కమిటీ యొక్క ఎన్నికలను నిర్వహించారు. ఈ ఎన్నికలలో అంద విద్యార్థుల తల్లిదండ్రులు నూతన కమిటీని ఎన్ను కున్నారు. ఈ కమిటీ రెండు సంవత్సరాల పాటు



పని చేస్తుందని తెలిపారు. పాత కమిటీలో చంద్రకళచైర్ పర్సన్ గా ,జీవన్ రావు వైస్ చైర్మన్గా, జి సుధా టీచర్ కన్వీనర్ గా, పేరెంట్స్ తలారి అబ్రహం మరియు ఇస్రాత్ బేగం కమిటీ సభ్యులుగా రెండేళ్ల వీరి పదవీకాలం ముగియడంతో, నూతన కమిటీ సభ్యులుగా మాల కొండయ్య చైర్మన్ గా కనకయ్య వైస్ చైర్మన్ గా వెంకటేష్ టీచర్ కన్వీనర్ గా పేరెంట్స్ అనురాధ మరియు హరి కిరణ్ నాయక్ కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో అందుల ప్రత్యేక పాఠశాల ప్రిన్సిపల్ ఎస్ జ్యోతి మరియు మానసిక దివ్యాంగుల పాఠశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి మరియు మానసిక అంద విద్యార్థుల తల్లిదండ్రులు. సిబ్బంది పాల్గొన్నారు.

సర్ ప్రక్రియను నిలిపివేయాలి
ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్

రాజీనామా చేయాలి



నిజామాబాద్ ప్రతినిధి అక్టోబర్ 06 (డీకే చాటింపు):దేశవ్యాప్తంగా జరుగుతున్న సర్ ప్రక్రియను వెంటనే ఆపివేయాలి అలాగే భారత ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తన పదవికి తక్షణమే రాజీనామా చేయాలని ఇండియా కూటమి మరియు వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో మోపాల మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్, CPI, CPI (ML) న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు కంజర భూమయ్య,వేల్పూర్ భూమయ్య, వేల్పూర్ కిషన్లు మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న సర్ ప్రక్రియకు సంబంధించిన ప్రజల్లో పలు సందేహాలు ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి అని అన్నారు.ఈ సందర్భంలో ఎస్ ఐ ఆర్ ని నిలిపివేస్తూ ఎన్నికల కమిషన్ లో అవకతవకలకు పాల్పడిన జ్ఞానేశ్ కుమార్ ను వెంటనే తొలగించాలి, ఆయన తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని కాంగ్రెస్, సిపిఐ,సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీలు కేంద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయని అన్నారు. ధర్నా కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ నాయకులు అగ్గు చిన్నయ్య, సిపిఐ నాయకులు అడికే రాజేశ్వర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు వేల్పూర్ కిషన్, కంజర సాయిలు,బాబు, నర్సింపల్లి సాయిలు, వేల్పూర్ గంగారం, వేల్పూర్ రమేష్,సిహెచ్ సాయి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గోశాల, వేద పాఠశాల కు స్థలం కేటాయించాలని బ్రాహ్మణ సేవా సమితి వినతి



బెల్లంపల్లి (డీకే చాటింపు) బెల్లంపల్లి పట్టణంలో బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం గాయత్రీ మాతా ఆలయంతో పాటు గౌశాల,యాగశాల,వేద పాఠశాల కొరకు ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ కృష్ణ కి కలిసి వినతి పత్రం సమర్పించిన బెల్లంపల్లి బ్రాహ్మణ సేవా సమితి సభ్యులు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బ్రాహ్మణ కుటుంబాలు ఏదైనా కార్యక్రమాలు చేయాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ, అందరితో పాటు తమ సంఘానికి కూడా ప్రభుత్వ స్థలాన్ని కేటాయిస్తే బాగుంటుందని విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై ఇది వరకు ఎమ్మెల్యే గడ్డం వినోద్ తో పాటు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ కి వినతి పత్రం సమర్పించినట్టు తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులు, అన్నీ రాజకీయ పార్టీల నాయకులు సానుకూలంగా స్పందించి తమ వంతుగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు వివిఎల్ఎస్ శ్రీనివాస్ రావు, కోశాధికారి జగన్మోహనాచారి,సలహాదారుడు రాంభట్ల హరీష్ శర్మ, ఇతర ఈసీ సభ్యులు పాల్గొన్నారు.

గంగాస్థాన్ లో పగలే వెన్నెల లా వెలుగుతున్న స్ట్రీట్ లైట్స్

నిజామాబాద్ ప్రతినిధి అక్టోబర్ 06 (డీకే చాటింపు):నిజామాబాద్ నగరం 3 వ డివిజన్ పరిధి గంగాస్థాన్ 2 లో వీధి లైట్లు ఒకవైపు ఏర్పాటు చేయుటలో బల్దియా అధికారులు నిమ్మకు నీరులా ఉన్నారని కాలనీ వాసులు పిర్యాదు చేస్తున్నారు. ముఖ్యంగా కాలనీ లో 12 వీధులు ఉండగా వీధి లైట్లు రావడం లేదని ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ కు అధికారులకు విన్నవిస్తున్నారు. కుక్కల బెదద కూడా ఎక్కువగా ఉందని భయపడుతున్నారు. ఇదిలా ఉండగా గుపనపల్లి నుండి కేశాపూర్ రహదారిలో పగలంతా వీధి లైట్లు వెలుగుతూనే ఉన్నాయి. ఒకవైపు పగలే వెలుగు, ఇంకోవైపు రాత్రి కూడా చీకటి అని కాలనీ వాసులు వాపోయారు.



మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించాలి:ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



ఎల్బీనగర్,(డీకే చాటింపు) నైపుణ్యాభివృద్ధితో స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకోవాలని:ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిఅన్నారు.జయచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చైతన్యపురి డివిజన్ పరిధిలోని న్యూ దిల్‌సుఖ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో గత కొన్ని రోజులుగా నిర్వహించిన ఉచిత కుట్టు శిక్షణ, బ్యూటీషియన్, మెహందీ కోర్సులను విజయవంతంగా పూర్తి చేసిన మహిళా సోదరీమణులకు సర్టిఫికెట్లను ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ,ట్రస్ట్ చైర్మన్ కమల సుధీర్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ ఒక మహిళ చేతిలో నైపుణ్యం ఉంటే ఒక కుటుంబం ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతుందని, ఒక కుటుంబం ఎదిగితే సమాజం అభివృద్ధి పథంలో నడుస్తుందని అన్నారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి, స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకోవాలనే లక్ష్యంతో జయచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ శిక్షణలో ప్రాథమిక స్థాయి నుంచి ఆధునిక కుట్టు నైపుణ్యాలతో పాటు బ్యూటీషియన్, మెహందీ వంటి ఉపాధి అవకాశాలకు ఉపయోగపడే కోర్సుల్లో సమగ్ర శిక్షణ అందిస్తున్నట్లు వెల్లడించారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన మహిళలు ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయడంతో పాటు, తమ కుటుంబ ఆర్థిక అభివృద్ధికి బలమైన పునాది వేసుకునే అవకాశం పొందుతారని అన్నారు. మహిళల నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక స్వావలంబన కోసం జయచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ భవిష్యత్తులోనూ మరిన్ని కార్యక్రమా లను నిర్వహిస్తుందని తెలిపారు.ఇట్టి కార్యక్రమంలో మ, యువ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి,ఎల్.బి.నగర్ నియోజకవర్గ భారస పార్టీ మహిళా అధ్యక్షురాలు రంగేశ్వరి నాయుడు,నర్సిరెడ్డి,రాపోలు సుధాకర్,విశ్వ ప్రేమ్,నాగలక్ష్మి,జ యశ్రీ,శోభారాణి మరియు ట్రైనర్లు సునీత, భానుప్రియ,శివబిందు,అర్చన మరియు



ట్రస్ట్ ప్రతినిధులు,బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు,శిక్షణ పొందిన మహిళలు,స్థానిక మహిళలు పాల్గొన్నారు.

పీక్స్ కు చేరిన పబ్లిసిటీ పిచ్చి....



న్యూయార్క్, : ఈ ప్రపంచంలో ఉన్న ఏ రాజకీయ నాయకుడైనా సరే ప్రచారాన్ని కోరుకుంటారు. కాకపోతే ఆ ప్రచారం జనాలు ఆమోదించే స్థాయిలో ఉండాలి. అది మరింత పెరిగిపోతే జనాలు ఆ రాజకీయ నాయకులను ట్రోల్ చేస్తూ ఉంటారు.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ట్రోల్ అవుతున్నారు. వాస్తవానికి ట్రంప్ ట్రోల్ అవడం ఇదే తొలిసారి కాకపోయినప్పటికీ.. ఈసారి ఆయన గురించి సోషల్ మీడియాలో విపరీతంగా చర్చ నడుస్తోంది. దీనికి ప్రధాన కారణం ట్రంప్ తీసుకున్న ఒక నిర్ణయం.అమెరికాలో అక్కడి నాణేలు ముద్రించే టంక శాల 250 వ జన్మదిన వేడుకలను జరుపుకుంటున్నది. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ముఖం కల్పించే విధంగా ఒక డాలర్ కాయిన్ విక్రయించడానికి సిద్ధంగా ఉన్నట్టు యూఎస్ మింట్ కాంపౌండ్ ప్రకటించింది. కాయిన్ మీద ఒకవైపు ట్రంప్ ముక్క చిత్రం.. లిబర్టీ.. 1776 అని ప్రింట్ చేశారు. ఇంకొక వైపు అమెరికా సంయుక్త రాష్ట్రాల అధికారికముద్రం ఉండే విధంగా చిత్రం రూపొందించారు. దీనికి అమెరికా కమిషన్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ తన ఆమోదాన్ని తెలిపింది.ఈ నాణేల తయారీకి సంబంధించి కమిషన్ సభ్యులను ట్రంప్ స్వయంగా నియమించడం విశేషం. అయితే తన ముఖచిత్రాన్ని నాణెం మీద ముద్రించాలి అనే కోరిక రావడం చాలా అసాధారణమైనదని.. ట్రంప్ ఆ మధ్య వ్యాఖ్యానించడం విశేషం. అమెరికన్ చట్టాల ప్రకారం అధ్యక్షుడు జీవించి ఉండగానే అమెరికన్ కరెన్సీ మీద ముద్రించడం నిషేధం. కానీ ప్రత్యేకమైన పరిస్థితుల్లో స్పెషల్ కాయిన్స్ ముద్రించడానికి.. ఆదేశాలు జారీ చేయడానికి అక్కడి ట్రెజరీ సెక్రటరీకి అధికారం ఉంటుంది. 20 కాయిన్స్ ఉన్న ఒక రోల్ ధర 61 అమెరికన్ డాలర్లుగా నిర్ణయించారు. అలాగే 100 కాయిన్స్ ఉన్న ఒక బ్యాగ్ ధర 154.50 డాలర్లుగా ప్రకటించారు.ట్రంప్ ముఖ చిత్రాన్ని కాయిన్స్ మీద ముద్రించడాన్ని అక్కడి విపక్ష సభ్యులు వ్యతిరేకిస్తున్నారు. ట్రంప్ కు ప్రచార పిచ్చి పీక్స్ లోకి వెళ్లిందని కామెంట్లు చేస్తున్నారు. అధ్యక్షుడు బతికి ఉండగానే ఇలాంటి పిచ్చి చేష్టలకు పాల్పడటం ట్రంప్ లో ఉన్న మరో కోణానికి నిదర్శనమని అక్కడికి విపక్ష నేతలు ఆరోపిస్తున్నారు. అయితే ఈ చర్యను ట్రంప్ సమర్థించుకోవడం విశేషం. గ్లోబల్ మీడియా మాత్రం ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలను తీవ్రంగా విమర్శిస్తున్నది.

అమెరికాకు 62 వేల కోట్ల నష్టం

ఒడిదుడుకుల్లో ఆర్థికం



న్యూయార్క్, : ఏ ముహూర్తంలో ట్రంప్ అమెరికా అధ్యక్షుడు అయ్యాడో తెలియదు గాని.. ఆ దేశానికి ఏది కూడా కలిసి రావడం లేదు. ఆంక్షలు.. సుంకాలు.. ప్రపంచ దేశాలను అనేక విధాలుగా ఇబ్బంది పెడుతున్నాడు ట్రంప్. ఒక రకంగా ప్రత్యక్ష నరకం అంటే ఏమిటో చూపిస్తున్నాడు. వాస్తవానికి ట్రంప్ విధిస్తున్న సుంకాలవల్ల ప్రపంచ దేశాల కంటే అమెరికాకే నష్టం ఎక్కువగా జరుగుతోంది. ఈ విషయాన్ని ట్రంప్ గుర్తించడం లేదు. ఏమాత్రం లెక్కలోకి తీసుకోవడం లేదు.ట్రంప్ వ్యవహరిస్తున్న తీరు ప్రపంచ దేశాలను ఇబ్బంది పెడుతోంది. అమెరికాలోని విపక్ష పార్టీల నేతలు కూడా ట్రంప్ తీరు పట్ల నిరసన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా అమెరికాలో కీలక బిల్లుల విషయంలో విపక్ష పార్టీ నిరసన వ్యక్తం చేసింది. బిల్లుల విషయంలో అధికార పార్టీ తీసుకొచ్చిన విధానాలకు వ్యతిరేకంగా స్వరం వినిపించింది. దీంతో అమెరికా ప్రభుత్వం ప్రస్తుతం షట్ డౌన్ అనే పరిస్థితిని ఎదుర్కొంటున్నది. గడిచిన 31 రోజులుగా అమెరికా ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నది. దీనివల్ల అమెరికాలో ఏకంగా 62,000 కోట్ల సంపద ఆవిరి అయిపోయింది.పరిస్థితి ఇలాగే కొనసాగితే 11 బిలియన్ డాలర్ల సంపద ఆవిరి అయిపోతుందని కాంగ్రెషనల్ బడ్జెట్ ఆఫీస్ పేర్కొంది. ఈ షట్ డౌన్ చాప కింద నీరు లాగా విస్తరిస్తోందని ఆర్థికరంగ నిపుణులు పేర్కొంటున్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థ బలహీనంగా మారిపోవడం వల్లే ఇదంతా జరుగుతోందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.. ఇది ఊహించిన దానికంటే అతిపెద్ద సమస్యగా మారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అమెరికాలో 1981 నుంచి షట్ డౌన్ అనేది కొనసాగుతూ వస్తోంది. అమెరికా ప్రభుత్వం ఇప్పటివరకు 10 సార్లు మూతపడింది.

అమెరికాలో ట్రంప్ అధ్యక్షుడైన తర్వాత 2018 -19 కాలంలో దాదాపు 35 రోజుల పాటు ప్రభుత్వం మూతపడింది. అమెరికా దేశ చరిత్రలోనే అతిపెద్ద సుదీర్ఘమైన మూసివేత అని అక్కడి నిపుణులు చెబుతున్నారు. ఇక ప్రస్తుతం చట్టసభ సభ్యుల మధ్య ఏమాత్రం రాజ కుదరడం లేదు. ఈ ప్రకారం తీసుకుంటే గత రికార్డును ఈసారి చోటు చేసుకున్న షట్ డౌన్ బద్దలు కొడుతున్న అనే అనుమానాలు వ్యక్తంఅవుతున్నాయి. ఇప్పటికే అమెరికా జాబ్ మార్కెట్ చాలా బలహీ నంగా ఉంది. షట్ డౌన్ ప్రభావం జాబ్ మార్కెట్ మీద తీవ్రతగా అనిపిస్తోంది. ఆర్థిక విధానాలు ఏమాత్రం బాగోలేదు. పైగా రాజకీయంగా కూడా ట్రంప్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో కంపెనీలు పెట్టుబడి పెట్టే విషయంలో ఆలోచిస్తున్నాయి. మిగతా కంపెనీలు కృత్రిమ మేధ, ఆటోమేషన్ మీద ఆధారపడుతున్నాయి.

కాంగ్రెస్ మైండ్ గేమ్ లో గులాబీ దళం



నల్గొండ, : వంద కాదు, ఐదువందలు కాదు.. ఏకంగా వెయ్యి రోజుల కాంగ్రెస్ మార్క్ పాలనపై అసెంబ్లీ సాక్షిగా 'ఛార్జ్‌షీట్' దాఖలు చేసి, రేవంత్ ప్రభుత్వాన్ని కడిగిపారేద్దామని గులాబీ బాస్‌లు పక్కా స్కెచ్ వేశారు. నల్ల చొక్కాలు తొడిగి, చేతిలో ప్లకార్డులు పట్టుకుని అసెంబ్లీ గేటు ముందు కేటీఆర్, హరీశ్‌రావులు దిగిన సీన్ చూసి.. ఇక ఈ వర్షాకాల సమావేశాల్లో 'హైవోల్టేజ్ డ్రామా' ఖాయం, కాంగ్రెస్ వికెట్ పడిపోవడం తథ్యం అని ప్రతిపక్ష శ్రేణులు తెగ మురిసిపోయాయి. తీరా కట్ చేస్తే.. అసలు కథ వేరేలా మారింది!ప్రభుత్వ వైఫల్యాలు, ఆరు గ్యారెంటీల బాకీల గురించి గళమెత్తాల్సిన చోట.. 'తాతా మధు' నోటి దురద పుణ్యమా అని కథ మొత్తం రివర్స్ తిరిగింది. పోలీసులతో తోపులాటలో ఆవేశం ఆపుకోలేక ఎమ్మెల్సీ గారు విసిరిన ఒక్క మాటతో.. కాంగ్రెస్‌కి బిగ్ ఆఫర్ దొరికినట్లయింది. ''దళిత స్పీకర్‌ను అవమానిస్తారా?'' అంటూ హస్తం నేతలు సెంటిమెంట్ కార్డు తీసి జనం మీదికి వదిలారు. ఇక అంతే! సభలో స్పీకర్ గారు కన్నీళ్లు పెట్టుకోవడం, కాంగ్రెస్ నేతలు 'దళిత ఆత్మగౌరవం' అంటూ రచ్చ చేయడం.. దీంతో బీఆర్ఎస్ తెచ్చిన 'వెయ్యి రోజుల వైఫల్యాల' అజెండా గాల్లో కలిసిపోయింది. ప్రభుత్వాన్ని కార్నర్ చేయాల్సిన గులాబీ నేతలు, చివరికి తమ నేత నోటిజారుడుకు సఫాయిలు చెప్పుకోవాల్సిన దయనీయ స్థితికి పడిపోయారు.రెండో రోజు సీన్ ఇంకా రసవత్తరంగా మారింది. అర్ధరాత్రి అరెస్టులు, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసులు, ఎమ్మెల్సీ సభ్యత్వం రద్దు డిమాండ్లు.. ఇలా సీన్ మొత్తం బీఆర్ఎస్ నేతలకు ఊపిరాడకుండా చేసింది. ఇక సీఎం రేవంత్‌పై కేటీఆర్ గారు పెంచిన "డోస్" ఏమైనా వర్కవుట్ అయిందా అంటే.. అదీ లేదు! ప్రత్యర్థిని దెబ్బకొట్టబోయి తామే మరింత ఆవేశపడి, కాంగ్రెస్ నేతల చేతికి మరో ఆయుధాన్ని అందించారు.మరోవైపు, షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యల వివాదం బీఆర్ఎస్‌కు పక్కా "గోల్డెన్ ఛాన్స్". దాన్ని పట్టుకుని జనాల్లో సానుభూతి పిండుకోవాల్సిన చోట.. కేటీఆర్ కంపెనీ ఆవేశంలో ఊగిపోయి ఆ అవకాశాన్ని నీళ్లపాలు చేసుకుంది.మొత్తానికి 'ఛార్జ్‌షీట్' పట్టుకుని కాంగ్రెస్‌ను కడిగేద్దామని వచ్చిన బీఆర్ఎస్.. చివరకు స్టేషన్ల చుట్టూ, కేసుల చుట్టూ తిరిగే పరిస్థితి తెచ్చుకుంది. ప్రత్యర్థిని ఆవేశంలో ముంచి తప్పు చేయించడంలో కాంగ్రెస్ మాస్టర్ ప్లాన్ వర్కవుట్ అయితే.. ఉన్న అవకాశాలను వదిలేసుకుని గులాబీ దళం భలే 'సెల్ఫ్‌గోల్' వేసుకుందంటూ రాజకీయ విశ్లేషకులు పెదవి విరుస్తున్నారు!

బహుజన చైతన్యానికి ముప్పు.. ఐక్యతే ఆయుధం..!

కుల అసమానతలు, అణచివేతలకు వ్యతిరేకంగా సాగిన ప్రతిఘటనల చరిత్రే భారత సామాజిక చరిత్ర. ప్రతి సామాజిక న్యాయ ఉద్యమం సమాజాన్ని ముందుకు నడిపించినప్పటికీ, దానికి ప్రతి స్పందనగా ఆధిపత్య రాజకీయాలు కొత్త రూపాల్లో పునరావృతమవుతూనే ఉన్నాయి.. నేడు కూడా ఒకవైపు రాజ్యాంగ విలువలు, సమాన హక్కులు, ప్రాతినిధ్యం కోసం బహుజన పోరాటాలు కొనసాగుతుండగా, మరోవైపు వాటిని నిర్వీర్యం చేసే శక్తులు వివిధ రూపాల్లో పనిచేస్తున్నాయి. రాజ్యాంగ విలువలతో సాగిన నీట్ పరీక్ష లీకేజీ ఉద్యమం దేశ రాజకీయాల్లో ఒక నూతన అధ్యాయాన్ని ప్రారంభించి ప్రభుత్వాన్ని కదిలించింది. ఈ ఉద్యమం ఒక దళితుడు అభిజీత్ దీప్కే నాయకత్వంలో, ఒక ఆదివాసీ సోనమ్ వాంగ్ చుక్ స్ఫూర్తితో ప్రజ్వరిల్లింది. దీనికి ప్రతిఘాతకంగా ఇటీవల "రిజర్వేషన్ హఠావో ఆందోళన" పేరుతో డిజిటల్ ఉద్యమం మొదలైంది. కుల ఆధారిత రిజర్వేషన్లను రద్దు చేసి, మెరిట్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని, ఆర్థిక ప్రాతిపదికన అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.. దేశ రాజకీయ చరిత్రను పరిశీలిస్తే.. ఇప్పటివరకు ఈ సంఘటనలు రెండుసార్లు మాత్రమే జరిగాయి. ఉదాహరణకు ఒకటి 1950 జనవరి 26న రాజ్యాంగం అమలులోకి రావడంతో అగ్రకులాలు తమ అదనపు హక్కులు కోల్పోతున్నామని భావించి, ఎన్.డి. తివారి నాయకత్వంలో రాజ్యాంగాన్ని కాల్చి నిరసనకు దిగారు.. వేల సంఖ్యలో పార్లమెంట్ ముందు ధర్నాకు దిగారు.. రెండోది 1990లో మండల్ కమిషన్ అమలుకు వ్యతిరేకంగా కమండల్ పేరుతో దేశవ్యాప్తంగా ఆందోళనకు దిగారు. బీసీ రిజర్వేషన్ అమలును వ్యతిరేకించారు. ఈ రెండు సందర్భాల్లోనూ బహుజ నులకు భారత రాజ్యాంగం హక్కులైన విద్య, ఉద్యోగ, రాజకీయ అవకాశాలు దగ్గరవడమే ప్రధాన కారణం. దేశంలో ఇంకా కొనసాగుతున్న కుల వివక్ష, సామాజిక అసమానతలను విస్మరించి రిజర్వేషన్లను రద్దు చేయాలన్న డిమాండ్ న్యాయబద్ధమేనా? నేడు దేశం ముందున్న అత్యంత కీలకమైన ప్రశ్న. రిజర్వేషన్లు తొలగిస్తే కుల వివక్ష తొలగిపోతుందా? లేక వేల ఏళ్లుగా అణచివేతకు గురైన వర్గాలు మరోసారి అదే చీకట్లోకి నెట్టబడతాయా? అనేది ప్రశ్న. అయితే, శతాబ్దాలుగా కుల ఆధిపత్యాన్ని కొనసాగించినవారే ఇప్పుడు 'రిజర్వేషన్ హఠావో' అనడం అట్టడుగు వర్గాల అవ కాశాలను, చైతన్యాన్ని బలహీన పరచడానికి కుట్ర చేస్తూ ప్రజా ఉద్యమంగా మలిచే ప్రయత్నం చేస్తున్నారు.. ఈ క్రమంలో రిజర్వేషన్ హఠావో ఉద్యమం సమానత్వానికా? ఆధిపత్యానికా ? అనే ప్రశ్నలు మేధావుల్లో తలెత్తుతున్నాయి. బహుజన యువత నాయకత్వంలో సీజేపీ ఉద్యమ విజయాన్ని ఓర్చుకోలేక అగ్ర వర్ణాలు "రిజర్వేషన్ హటావో" నినాదాన్నీ ముందుకు తేవడం గమనార్హం. అగ్రకులాల తెరపైకి తీసుకొచ్చి కృత్రిమ ఉద్యమం ఇది. ఇది కేవలం రిజర్వేషన్లపై వివాదం కాదు, శతాబ్దాల ఆధిపత్యానికి సబ్బండ కులాల చైతన్యం విసిరిన సవాల్. ఈ నేపథ్యంలో అణగారిన వర్గాల ఐక్యత ఎంత బలపడితే, ప్రతి ఘటన అంత తీవ్రంగా ఉంటుందనే చారిత్రక సత్యాన్ని ఈ పరిణామాలు మరోసారి స్పష్టం చేస్తున్నాయి. భారత రాజ్యాంగం ప్రకారం రిజర్వేషన్స్ దానం కాదు, దయ కాదు, మెరిట్‌కు వ్యతిరేకమైనవి కూడా కాదు.. న్యాయ మైన అవకాశాలను కల్పించే ఈక్విటీ (సమన్యాయం) సూత్రం. చారిత్రకంగా, సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలు సమాన స్థాయిలో పోటీపడే పరిస్థితులను కల్పిస్తుంది. శివుని సమానత్వం, బసవేశ్వరుని సమానత్వం కూడా ఇందులో ఇమిడి ఉంది.

రిపబ్లికన్లు గెలిస్తే ప్రతి అమెరికన్‌కు 5 వేల డాలర్లు

న్యూయార్క్, : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తీవ్ర చర్చనీయాంశమైన ప్రకటన చేశారు. రాబోయే మధ్యంతర ఎన్నికల్లో తమ రిపబ్లికన్ పార్టీ విజయం సాధించి, కాంగ్రెస్‌లోని ఉభయ సభలపై నియంత్రణ సాధిస్తే.. దేశంలోని ప్రతి వయోజన అమెరికా పౌరుడికి 5,000 డాలర్లు (సుమారు రూ. 4.2 లక్షలు) ఇస్తామని డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ సంక్షేమాన్ని ఆయన "ట్రంప్ డివిడెండ్" గా పేర్కొన్నారు.టెక్సాస్‌లోని దల్లాస్‌లో జరిగిన రిపబ్లికన్ పార్టీ మధ్యంతర ఎన్నికల సభలో డొనాల్డ్ ట్రంప్ ఈ ప్రతిపాదన చేశారు. డెమోక్రాట్‌లతో పోటీలో రిపబ్లికన్ పార్టీ ఓటింగ్ సర్వేల్లో వెనుకబడి ఉన్న నేపథ్యంలో, ఓటర్లను ఆకర్షించేందుకు ట్రంప్ ఈ అసాధారణ హామీ ఇచ్చినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ సభలో ట్రంప్ మాట్లాడుతూ.. "అమెరికా అద్భుతమైన ఆర్థిక విజయం కారణంగా ఈ హామీ నేను మాత్రమే చేయగలను. నవంబర్ 3న జరగబోయే ఎన్నికల్లో రిపబ్లికన్లు గెలిస్తే, మీరు మాతో కలిసి గెలుస్తారు. మీకు 5,000 డాలర్లు లభిస్తాయి. నవంబర్ బ్యాలెట్‌లో నేను స్వయంగా పోటీలో ఉన్నట్లే భావించి ఓటు వేయండి" అని మద్దతుదారులను కోరారు. 1.35 ట్రిలియన్ డాలర్ల భారం ట్రంప్ డెవిడెండ్ హామీ అమలుపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం అమెరికాలో దాదాపు 27 కోట్ల మంది వయోజనులు ఉన్నారు. ప్రతి ఒక్కరికీ 5,000 డాలర్ల చొప్పున పంపిణీ చేయాలంటే ప్రభుత్వానికి సుమారు 1.35 ట్రిలియన్ డాలర్లు ఖర్చవుతుందని విశ్లేషకులు తెలిపారు. అయితే, ఈ భారీ మొత్తం నిధులుఎక్కడి నుంచి వస్తాయనే దానిపై ట్రంప్ స్పష్టత ఇవ్వలేదు. "మన దేశం చాలా డబ్బు సంపాదిస్తోంది" అని మాత్రమే ట్రంప్ చెప్పారు. ఈ చెల్లింపుల ప్రక్రియ ఎలా పనిచేస్తుంది, అసలు ఇలా డబ్బులు పంచడం చట్టబద్ధమేనా అనే అంశాలపై ఇంకా స్పష్టత లేదు.మధ్యంతర ఎన్నికల్లో గెలవడం కోసం ట్రంప్ బహిరంగంగా ఓటర్లకు లంచం ఇస్తున్నారని విమర్శకులు, సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తున్నాయి. "రిపబ్లికన్లకు ఓటు వేస్తే వి5,000 ఇస్తాననడం డివిడెండ్ ఎంతమాత్రం కాదు.. అది పక్కా లంచం" అని ఎక్స్ వేదికగా నెటిజన్లు ఆరోపించారు. ప్రముఖ అమెరికన్ స్టాక్ బ్రోకర్ పీటర్ షిఫ్ స్పందిస్తూ.. "ఓటర్లను ఆకట్టుకోవడానికి ట్రంప్ ఈ రకమైన ప్రతిపాదన చేశారు. ఈ ఉచిత డబ్బు కోసం ఫెడరల్ రిజర్వ్ భారీగా కరెన్సీ నోట్లను ముద్రించాల్సి వస్తుంది. ఫలితంగా బైడెన్ హయాంలో చూసిన దానికంటే అతి తీవ్రమైన ద్రవ్యోల్బణం వచ్చే ప్రమాదం ఉంది" అని హెచ్చరించారు. ఓట్ల కోసం ట్రంప్ చేసిన ఈ 1 ట్రిలియన్ డాలర్ల వాగ్దానం ఇప్పుడు అమెరికా వ్యాప్తంగా తీవ్ర రాజకీయ, ఆర్థిక చర్చకు దారితీసింది.

వరంగల్, ఖమ్మం, కరీంనగర్ కార్పొరేషన్లకు..

ఔటర్ రింగ్ రోడ్డు

హైదరాబాద్, : తెలంగాణలో కొత్తగా మరికొన్ని నగరాలకు ఔటర్ రింగ్ రోడ్డులు రాబోతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లతో పాటు ఇతర ప్రాంతాలకు సంబంధించి మెగా గ్రోత్ కారిడార్‌ల్లో ఏకరీతి అభివృద్ధి ప్రణాళికలను అమలు చేయాలని అధికారుల్ని ఆదేశించారు. వరంగల్, ఖమ్మం, కరీంనగర్ కార్పొరేషన్లకు ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణంపై మున్సిపల్‌శాఖకు సూచి ంచారు. రాష్ట్రంలో మెగా గ్రోత్ కారిడార్ల అభివృద్ధి, వాటి ప్రణాళికలపై ఎంసీఆర్ హెచ్‌ఆర్డీలో మున్సిపల్ వ్యవహారాలు, పట్టణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తెలంగా ణలోని ప్రతిపాదిత మెగా గ్రోత్ కారిడార్ల అభివృద్ధి ప్రణాళికలపై అధికారులకు పలు సూచనలు చేశారు.'మహబూబ్‌నగర్, భూత్పూర్, జడ్చర్లను కలుపుతూ గ్రోత్ కారిడార్ ఏర్పాటు ప్రణాళికలు రూపొం దించాలి. కొత్తగూడెం, పాల్వంచ, సుజాతనగర్ కలిపి గ్రోత్ కారిడార్ ఏర్పాటు చేయాలి. నల్గొండ, యాదగిరిగుట్ట మధ్య టెంపుల్ కారిడా ర్‌ను, ఆదిలాబాద్, నాగోబా, బాసర, కడెం ప్రాజెక్టులను కలుపుతూ టూరిజం కారిడార్ ఏర్పాటు కావాలి. కృష్ణా పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని అలంపూర్ జోగులాంబ ఆలయ అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలి. సింగరేణి పరిధిలో ఉన్న అన్ని మున్సిపాలిటీలను ఒక యూనిట్‌గా అభివృద్ధి చేయాలి. సింగరేణి సంస్థ సీఎస్ఆర్ నిధులను స్థానికంగానే ఖర్చు చేయాలి. ఘన వ్యర్థాల నిర్వహణ ప్లాంట్లు, రింగ్ రోడ్లు, మురుగునీటి శుద్ధి ప్లాంట్లు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థలతో పాటు ఇతర అంశాలన్నీ గ్రోత్ కారిడార్లలో స్పష్టంగా ఉండాలి' అని రేవంత్ రెడ్డి సూచించారు.

జనసేన మెంబర్ షిప్ డ్రైవ్..

కాకినాడ,: జనసేన జనం కోసమే పార్టీ అన్నది పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ నినాదం. పార్టీ పెట్టి ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రి హోదాలో ఉన్నారు పవన్. ఎంత కూటమిలో ఉన్నప్పటికీ పార్టీని బలోపేతం చేసుకోవాల్సి ఉందన్న సత్యాన్ని గుర్తించిన పవన్.. ఆదిశగా శరవేగంగా అడుగులేస్తున్నారు.

సంస్థాగతంగా పార్టీని పటిష్ఠం చేయడమే లక్ష్యంగా, 'మెంబర్‌షిప్ టు లీడర్‌షిప్' అనే శక్తిమంతమైన నినాదంతో మూడో విడత క్రియాశీలక సభ్యత్వ నమోదుకు జనసేనాని శ్రీకారం చుట్టారు.కేవలం ఆంధ్రప్రదేశ్ కే పరిమితం కాకుండా తెలంగాణ, కర్ణాటక, తమిళనాడుతో పాటు మహారాష్ట్ర లోనూ తన ఉనికిని చాటుకోవాలని పార్టీ అధిష్ఠానం నిర్ణయించడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

ఇప్పుడప్పుడే చర్చల్లేవ్

అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ వెల్లడి...



ఇరాన్ విషయంలో ఏం చేయాలనే దానిపై అన్ని అవకాశాలనూ పరిశీలిస్తున్నామని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ చెప్పారు. ఆర్థిక, సైనిక, దౌత్య, రహస్య చర్యలు సహా అనేక మార్గాలు తమ పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. అయితే ఇరాన్‌తో ఇప్పుడప్పుడే చర్చలు జరిపే ప్రసక్తే లేదని తెలిపారు. హార్మూజ్ జలసంధిలో ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులు ఆపేంతవరకూ ఆ దేశంతో చర్చలు జరపబోమని అన్నారు. ఇరాన్‌పై అమెరికా సైనిక చర్యల నేపథ్యంలో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ వాన్స్ అధ్యక్షభవనంలో విలేకరులతో మాట్లాడారు. 'దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైఖరి స్పష్టంగా ఉంది. వాణిజ్య నౌకలపై దాడులు ఆపేంతవరకూ ఇరాన్‌తో చర్చించబోమని ఆయన చాలా స్పష్టంగా చెప్పారు' అని గుర్తు చేశారు. వాణిజ్య నౌకలపై ఇరాన్ జరుపుతున్న దాడులు రెండు దేశాల మధ్య దౌత్యపరమైన ప్రయత్నాలు ముందుకు సాగడానికి ప్రధాన అడ్డంకిగా మారాయని చెప్పారు. చర్చలు తిరిగి ప్రారంభం కావాలంటే నౌకలను లక్ష్యంగా చేసుకోవడాన్ని ఇరాన్ ఆపేయాలని సూచించారు. ఇరాన్‌పై తాము చేపట్టిన సైనిక చర్యల కారణంగానే హార్మూజ్‌లో నౌకాయానం పెరగడానికి అనువైన వాతావరణం ఏర్పడిందని తెలిపారు. నవంబరులో మధ్యంతర ఎన్నికలు జరిగే వరకూ ఘర్షణలు కొనసాగుతాయా అని విలేకరులు ప్రశ్నించగా 'నేను దానిని యుద్ధంగా అనుకోవడం లేదు' అని అన్నారు. ప్రస్తుతం ఎలాంటి కాల్పులు జరగడం లేదని, ఆరు వారాల తర్వాత ప్రధాన ఆపరేషన్స్ ముగిసిపోయాయని చెప్పుకొచ్చారు.అయితే కొన్ని ప్రాంతాలలో తిరిగి పోరు ప్రారంభమైందని, ఇరాన్‌తో ఉద్రిక్తతలు పరిష్కారం కాలేదని తెలిపారు. ప్రస్తుత పరిస్థితికి ముగింపు లభిస్తుందా అని అడిగిన ప్రశ్నకు వాన్స్ బదులిస్తూ నిర్దిష్టమైన గడువు ఏదీ చెప్పలేనని, నౌకలపై జరుగుతున్న దాడులకు సంబంధించి ఇరాన్ నిర్ణయంపై అది ఆధారపడి ఉంటుందని చెప్పారు.

అసలు ఈ ప్రశ్నను ఇరాన్‌నే అడగాలని సూచించారు. పరిస్థితి క్షీణిస్తే ఇరాన్‌పై వేర్వేరు రూపాలలో ఒత్తిడిని కొనసాగిస్తామని అన్నారు. వెనిజులా చమురు నిల్వలపై నియంత్రణను అమెరికాకు బదిలీ చేసేందుకు ఉద్దేశించి కుదుర్చుకున్న ఒప్పందంతో అంతర్జాతీయ చమురు ధరలు దిగివచ్చాయని చెప్పారు. ఇరాన్‌పై తాము చేసిన యుద్ధానికి తగినంత సహకారం అందించని మిత్రదేశాలపై ఆయన మండిపడుతూ ఇంధన సంక్షోభాన్ని ట్రంప్ ఒంటిచేత్తోనే నిరోధించారని కొనియాడారు. ఇరాన్‌లోని సిరిక్ నగరంలో వివాహ వేడుకపై అమెరికా జరిపిన దాడి గురించి ప్రశ్నించగా దానిపై విచారణ జరుగుతోందని చెప్పారు. ఒకవేళ సైన్యం తప్పు చేస్తే గుణపాఠం నేర్చుకుంటుందని వాన్స్ అన్నారు.

కోర్టుకెక్కితే బెడిసికొట్టింది..!

అక్రమ భవనం సీల్ చేయాలని హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, : అక్రమ నిర్మాణాన్ని క్రమబద్ధీకరించాలని కోరుతూ కోర్టుకెక్కిన ఓభవన యజమానికి తెలంగాణ హైకోర్టులో గట్టి ఎదురు దెబ్బ తగిలింది. పిటిషనర్‌కు ఎలాంటి ఉపశమనం ఇవ్వకపోగా, ఆ అక్రమ భవనాన్ని తక్షణమే సీల్ చేయాలని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)ని ఆదేశించింది. అంతేకాకుండా, ఇకపై రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నిర్మాణ స్థలం వద్ద తప్పనిసరిగా బిల్డింగ్ పర్మిషన్ వివరాలను ప్రదర్శించాలని కీలకమైన ఆదేశాలు జారీ చేసింది.హైదరా బాద్ పాతబస్తీలోని సిద్దంబర్ బజార్‌లో రాజ్ కుమార్ అనే వ్యాపారికి చెందిన స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా గ్రౌండ్ ప్లస్ ఐదు అంతస్తుల భవనాన్ని నిర్మించారు. ఈ నిర్మాణంపై జీహెచ్ఎంసీ అధికారులు షోకాజ్ నోటీసులుజారీ చేసి,నిర్మాణాన్ని ఆపాలని ఆదేశాలు ఇచ్చారు. అయినప్పటికీ నిర్మాణం కొనసాగడంతో, తన అదనపు నిర్మాణాన్ని జీహెచ్ఎంసీ చట్టంలోని సెక్షన్లు 455-ం, 455-ంం కింద రెగ్యులరైజ్ చేయాలంటూ రాజ్ కుమార్ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు.

రూ.1 స్క్రీమ్‌తో మోసం

ఈ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ బి. విజయసేన్ రెడ్డి ధర్మాసనం.. పిటిషనర్ అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించింది.

జీహెచ్ఎంసీ వాదనల ప్రకారం, రాజ్ కుమార్‌కు మొత్తం 114.14 చదరపు గజాల స్థలం ఉండగా, కేవలం 43.29 చదరపు మీటర్లకే తన పేరు మీద పర్మిషన్ తీసుకున్నారు. మిగిలిన భాగాన్ని మరో ముగ్గురి పేర్ల మీద చూపించారు. 75 గజాల లోపు ప్లాట్లకు వర్తించే తెలంగాణ బిల్డింగ్ పర్మిషన్ అప్రూవల్ అండ్ సెల్ఫ్ సర్టిఫికేషన్ సిస్టమ్ (ూ-ఎఖయూ) కింద ఉన్న ?1 టోకెన్ రిజిస్ట్రేషన్ సౌకర్యాన్ని దుర్వినియోగం చేసేందుకే ఇలా చేశారని జీహెచ్ఎంసీ కోర్టుకు వివరించింది. నిబంధనల ప్రకారం, 75 గజాల కంటే పెద్ద ప్లాట్‌ను ఇలా విభజించి మినహాయింపులు పొందడం చట్టవిరుద్ధం.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రుణాలపై వడ్డీ రేట్లు తగ్గింపు!

ప్రైవేట్ రంగ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తన మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్-బేస్డ్ లెండింగ్ రేట్లను (ఎంసీఎల్ఆర్) 10 బేసిస్ పాయింట్ల (0.10 శాతం) వరకు తగ్గించింది. సవరించిన రేట్లు సెప్టెంబర్ 7 నుండి అమల్లోకి వచ్చాయని బ్యాంకు వెల్లడించింది. దీంతో గతంలో 8-8.65 శాతంగా ఉన్న ఎంసీఎల్ఆర్ రేటు ఇప్పుడు 7.90-8.60 శాతానికి దిగివచ్చింది.

ఓవర్‌నైట్, ఒక నెల, మూడు నెలలు, రెండేళ్ల కాలపరిమితుల రేట్లపై 10 బేసిస్ పాయింట్లు కోత విధించగా, ఆరు నెలలు, ఒక సంవత్సరం, మూడు సంవత్సరాల రేట్లపై 5 బేసిస్ పాయింట్ల మేర తగ్గించారు. దీంతో ఓవర్‌నైట్,

ఒక నెల ఎంసీఎల్ఆర్ అత్యల్పంగా 7.90 శాతం కాగా, మూడేళ్ల రేటు గరిష్టంగా 8.60 శాతం వద్ద ఉంది.

దీనికి తోడు బ్యాంక్ తన బెంచ్‌మార్క్ ప్రైమ్ లెండింగ్ రేట్‌ను (బీపీఎల్ఆర్) కూడా 17.30 శాతం నుంచి 17.20 శాతానికి తగ్గించింది. ఎంసీఎల్ఆర్ తగ్గినంత మాత్రాన ప్రతి ఒక్కరి నెలవారీ వాయిదా (ఈఎంఐ) సెప్టెంబర్ నుంచే తగ్గిపోదు. ఈ తగ్గింపు ప్రభావం రుణగ్రహీత లోన్ ఏ బెంచ్‌మార్క్‌కు లింక్ చేశారనే దాన్ని బట్టి ఉంటుంది. దాని 'రీసెట్ ఫ్రీక్వెన్సీ' (రేటు సమీక్షా కాలం), బ్యాంక్ వసూలు చేసే 'స్ప్రెడ్' మార్జిన్‌పై ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు, ఏటా రీసెట్ అయ్యే హోమ్ లోన్ తీసుకున్న వారికి, తదుపరి రీసెట్ తేదీ నాటికి మాత్రమే ఈ కొత్త రేట్లు వర్తిస్తాయి.

అలాగే, ఆర్‌బీఐ రెపో రేటుతో ముడిపడి ఉన్న ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ లోన్‌లకు ఇది వర్తించదు. కాబట్టి రుణగ్రహీతలు ముందుగా తమ రుణం ఏ బెంచ్‌మార్క్ (ఎంసీఎల్ఆర్, బేస్ రేట్ లేదా రెపో) కింద ఉందో చెక్ చేసుకోవడం మంచిది. సాధారణంగా రేట్లు తగ్గినప్పుడు బ్యాంకులు నెలవారీ ఈఎంఐ అమౌంట్‌ను తగ్గించకుండా, లోన్ టెన్యూర్ తగ్గిస్తాయి. ఈఎంఐనే తగ్గించుకోవాలంటే బ్యాంకును ప్రత్యేకంగా అడగాల్సి ఉంటుంది.



బొగ్గు గ్యాసిఫికేషన్ రేసులో అదానీ, ఎన్‌టీపీసీ...



బొగ్గు, లిగ్నైట్‌ను గ్యాస్‌గా మార్చే ప్రాజెక్టులను ప్రోత్సహించేందుకు కేంద్రం ప్రకటించిన రూ. 37,500 కోట్ల విలువైన గ్యాసిఫికేషన్ పథకానికి తొలి విడతలోనే మంచి స్పందన వచ్చింది. అదానీ ఎంటర్‌ప్రైజెస్, ఎంటీపీసీ సహా ఐదు కంపెనీలు మొత్తం ఏడు ప్రాజెక్టులకు దరఖాస్తు చేసుకున్నట్లు బొగ్గు మంత్రిత్వ శాఖ తెలిపింది.

అదానీ ఎంటర్‌ప్రైజెస్ మూడు యూరియా ప్రాజెక్టులకు ప్రతిపాదనలు పంపగా, తాల్చేర్ ఫెర్టిలైజర్స్ మరో యూరియా ప్రాజెక్టుకు దరఖాస్తు చేసింది.

డీఆర్ఐ (డైరెక్ట్ రెడ్యూస్డ్ ఐరన్), సింథటిక్ గ్యాస్ ప్రాజెక్టును గ్యాలంట్ ఇస్పాత్, సింథటిక్ నేచురల్ గ్యాస్ ప్రాజెక్టును ఎంటీపీసీ, సింథటిక్ గ్యాస్ ప్రాజెక్టును శ్యామ్ సెల్ అండ్ పవర్ ప్రతిపాదించాయి. సెప్టెంబర్ 8 నుంచి రెండో విడత దరఖాస్తుల ప్రక్రియ మొదలైంది. ఇకపై ప్రతి రెండు నెలలకు కొత్త దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమవుతుంది. దీంతో ప్రాజెక్టులు సిద్ధమైన కంపెనీలు ఎప్పటికప్పుడు తమ ప్రతిపాదనలు సమర్పించవచ్చు. దేశంలో లభించే బొగ్గును ఉపయోగించి సింగాస్, మిథనాల్, అమ్మోనియా, యూరియా వంటి అధిక విలువైన ఉత్పత్తులను తయారు చేయడం ద్వారా విదేశీ దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడమే ఈ ప్రాజెక్ట్ ముఖ్య ఉద్దేశం. ప్రస్తుతం విదేశాల నుంచి ఈ ఉత్పత్తులను దిగుమతి చేసుకోవడానికి ఏటా దాదాపు రూ. 2.77 లక్షల కోట్లు ఖర్చవుతోంది. ఈ పథకం ద్వారా మొత్తం 25 ప్రాజెక్టులలో సుమారు రూ. 2.5 నుండి రూ. 3 లక్షల కోట్ల భారీ పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా, 50,000 ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలను సృష్టించాలని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

ఎయిరిండియా కొత్త సీఈవో ముందు సవాలు..!



- కోలుకోవడానికి దశాబ్దం పట్టే ఛాన్స్

ఎయిర్ ఇండియా కొత్త చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా టెవోల్డే గెబ్రెమరియమ్ బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన సీఈవో ముందు భారీ సవాల్ ఉంది. ప్పుడు నష్టాలు, నగదు కొరత, భారీ పెట్టుబడులతో సతమతమవుతున్న ఎయిర్ ఇండియాను గాడిలో పెట్టాల్సి ఉంది. సంస్థ పునరుద్ధరణకు మరోసారి భారీగా నిధులు అవసరం కావచ్చన్న అంచనాలు కూడా ఉన్నాయి. క్యాంప్‌బెల్ విల్సన్ స్థానంలో బాధ్యతలు చేపట్టిన గెబ్రెమరియమ్‌కు ఎయిర్ ఇండియా పరివర్తన, కార్యకలాపాల నిర్వహణ, భద్రత, లాభదాయకమైన విస్తరణలో అనుభవం ఉందని సంస్థ పేర్కొంది. అయితే భారత్‌లో ఆయన ముందున్న పరిస్థితి ఇథియోపియన్ ఎయిర్‌లైన్స్‌తో పోలిస్తే మరింత సంక్లిష్టమైనదిగా విశ్లేషకులు చెబుతున్నారు. టాటా గ్రూప్ 2022 జనవరిలో ఎయిర్ ఇండియాపై మళ్లీ నియంత్రణ సాధించిన తర్వాత నాలుగేళ్లు గడిచాయి. అయినప్పటికీ సంస్థ పరివర్తనకు అవసరమైన ఆర్థిక భారం ఇప్పుడు మరింత స్పష్టమవుతోంది. ఎయిర్ ఇండియా షేర్‌హోల్డర్ల నుంచి సుమారు 1.5 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.12,500 కోట్లు) తాజా ఈక్విటీ నిధులుగా సమీకరించాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో సంస్థ నష్టాలు రెండింతలకు పైగా పెరిగాయి. కార్యకలాపాల నుంచి వచ్చే నగదు ప్రవాహం కూడా ప్రతికూలంగా మారింది. అయితే ఈ నిధులు కేవలం నష్టాలను భర్తీ చేసేందుకు మాత్రమే కాదు. ఎయిర్ ఇండియా తన విమానాల సంఖ్యను పెంచడం, పాత విమానాలను ఆధునీకరించడం, క్యాబిన్లను పునరుద్ధరించడం, టెక్నాలజీ, ఆపరేషనల్ సిస్టమ్స్‌ను అప్‌గ్రేడ్ చేయడం, సిబ్బంది సంఖ్యను పెంచడం వంటి అనేక పనులు చేపడుతోంది. ఎయిర్ ఇండియా త్వరగా లాభాల్లోకి వస్తుందని ఆశించడం సరికాదని టాటా సన్స్ చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ గతంలోనే హెచ్చరించారు. టాటా సన్స్ ఈజ26 వార్షిక నివేదికలో వాటాదారులకు ఇచ్చిన సందేశంలో.. ఎయిర్ ఇండియా పరివర్తనను ఐదు నుంచి పదేళ్ల ప్రయాణంగా చూడాలని పేర్కొన్నారు. "ఎయిర్‌లైన్స్ చరిత్రలో గొప్ప సంస్థలన్నీ కొన్ని త్రైమాసికాల్లో కాకుండా దశాబ్దాల కాలంలో నిర్మితమయ్యాయి" అని చంద్రశేఖరన్ వ్యాఖ్యానించారు. టాటా గ్రూప్‌కు ఎయిర్ ఇండియా అప్పగించబడినప్పుడు పాత విమానాలు, పాత టెక్నాలజీ వ్యవస్థలు, సేవల పరంగా సమస్యలు, సంస్థాగత మరియు సాంస్కృతిక మార్పుల అవసరం వంటి అనేక సవాళ్లు ఉన్నాయి. ఇప్పుడు వీటన్నింటినీ దశలవారీగా మార్చాల్సి వస్తోంది. దేశీయ మార్గాల్లో నడిచే ఎయిర్ ఇండియా న్యారో-బాడీ విమానాల రీఫర్బిష్‌మెంట్ పూర్తయింది. వైడ్-బాడీ విమానాల ఆధునీకరణ కార్యక్రమం మాత్రం ఈజ28 చివరి వరకు కొనసాగే అవకాశం ఉంది. అదే సమయంలో కస్టమర్ సంతృప్తిని కొలిచే నెట్ ప్రమోటర్ స్కోర్ (ఔఖూ) కూడా మెరుగుపడినట్లు సంస్థ పేర్కొంది. అయితే విమానాల రీఫర్బిష్‌మెంట్ ఒక్కటే సరిపోదు. విమానాల విశ్వసనీయత, సేవల నాణ్యత, టెక్నాలజీ, నెట్‌వర్క్, శిక్షణ, నిర్వహణ సామర్థ్యాలను కూడా భారీగా మెరుగుపరచాల్సి ఉంది. విమానాలు, విడిభాగాల సరఫరాలో ఎదురవుతున్న సమస్యలు ఈ ప్రక్రియను మరింత కష్టతరం చేస్తున్నాయి.ఎయిర్ ఇండియాకు ప్రస్తుతం ఒక ప్రత్యేకమైన ఆర్థిక సమస్య ఎదురవుతోంది. భవిష్యత్తులో లాభదాయకమైన ఎయిర్‌లైన్‌గా మారేందుకు భారీగా ఖర్చు చేయాలి. కానీ అదే సమయంలో ప్రస్తుత కార్యకలాపాలే నగదును ఖర్చు చేస్తున్నాయి. ఎయిర్ ఇండియా గ్రూప్ వందలాది కొత్త విమానాలను ఎయిర్‌బస్, బోయింగ్ నుంచి అందుకోనుంది. పాత విమానాల స్థానంలో కొత్త వాటిని ప్రవేశపెట్టడం, దేశీయ-అంతర్జాతీయ నెట్‌వర్క్‌ను విస్తరించడం దీని లక్ష్యం.కొత్త విమానాలు రావడంతో వాటి కోసం పైలట్లు, క్యాబిన్ సిబ్బంది, ఇంజినీర్లు, నిర్వహణ సదుపాయాలు వంటి వాటిపై కూడా భారీగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. అదనపు విమాన సామర్థ్యాన్ని లాభదాయకంగా వినియోగించేందుకు కొత్త మార్గాలను కూడా అభివృద్ధి చేయాలి. అందువల్ల ఇప్పుడే భారీగా ఖర్చు చేసి.. భవిష్యత్తులో స్థిరమైన లాభాలను సాధించాల్సిన పరిస్థితి ఎయిర్ ఇండియాకు ఏర్పడింది.

డబ్బు దాచేవారికి రిలయన్స్ బంపర్ ఆఫర్..



- 7.47% వడ్డీపై ఈ విషయాలు తెలుసుకోండి!

దేశంలోని అతిపెద్ద వ్యాపార సంస్థల్లో ఒకటైన రిలయన్స్ ఇండస్ట్రీస్ దేశీయ డెట్ మార్కెట్‌లో భారీ ఫండ్ రైజింగ్‌కు రెడీ అవుతోంది. ముకేశ్ అంబానీ నేతృత్వంలోని ఈ సంస్థ దాదాపు మూడేళ్ల విరామం తర్వాత భారత రూపాయి బాండ్ మార్కెట్‌లోకి తిరిగి అడుగుపెడుతోంది. ఆయిల్ నుంచి టెలికాం వరకు విస్తరించిన కంపెనీ వ్యాపారాలను మరింత బలోపేతం చేసుకునే దిశగా భారీగా నిధులు సమీకరించే వ్యూహాన్ని రూపొందించినట్లు సమాచారం. మర్చంట్ బ్యాంకర్ల సమాచారం ప్రకారం.. ఈ బాండ్ ఇష్యూ ఇటీవలి కాలంలో దేశీయ కార్పొరేట్ బాండ్ మార్కెట్‌లో జరిగిన అతిపెద్ద నిధుల సమీకరణల్లో ఒకటిగా నిలిచే అవకాశం ఉంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ ఐదేళ్ల కాలవ్యవధి కలిగిన బాండ్లను జారీ చేయడం ద్వారా సుమారు రూ.12,500 కోట్లు సమీకరించాలని యోచిస్తోంది. ఈ బాండ్లపై ఇన్వెస్టర్లకు ఏడాదికి 7.47 శాతం వడ్డీ అందించే ప్రతిపాదన ఉన్నట్లు సమాచారం. ఈ ఇష్యూ కోసం సంస్థాగత, అర్హత కలిగిన ఇతర ఇన్వెస్టర్ల నుంచి బిడ్లను స్వీకరించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రేటెడ్ నాన్ ? ఫైనాన్షియల్ కంపెనీ ఒకేసారి ఇంత భారీ మొత్తాన్ని సమీకరించడం నవంబర్ 2023 తర్వాత ఇదే తొలిసారి కావచ్చని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. దేశీయ బాండ్ మార్కెట్‌లోకి రిలయన్స్ తిరిగి రావడం వెనుక కీలకమైన కారణం రుణ వ్యయం అని సమాచారం. ఇటీవలి నెలల్లో భారత్‌లో ఐదేళ్ల కాలవ్యవధి బాండ్ల యీల్డ్ తగ్గుముఖం పట్టింది. జూన్ ప్రారంభం నుంచి ఇప్పటివరకు ఐదేళ్ల ప్రభుత్వ బాండ్ యీల్డ్‌లో సుమారు 33 బేసిస్ పాయింట్ల తగ్గుదల నమోదైంది. మరోవైపు అమెరికాలో ట్రెజరీ యీల్డ్స్ అధిక స్థాయిలో కొనసాగుతున్నాయి. దీంతో భారతీయ కంపెనీలు డాలర్లలో రుణాలు తీసుకోవడం ఖరీదైన వ్యవహారంగా మారింది. భారత్‌లో రూపాయిల్లో నిధులు సమీకరించడం తక్కువ వ్యయంతో కూడుకున్న మార్గంగా మారడంతో రిలయన్స్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.ఈ భారీ బాండ్ ఇష్యూకు దేశంలోని ప్రముఖ ప్రైవేట్ బ్యాంకులు అరేంజర్లుగా వ్యవహరించనున్నట్లు సమాచారం. అంతేకాకుండా ఈ బ్యాంకులు స్వయంగా కూడా బాండ్లలో కొంత భాగాన్ని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. ఐదేళ్ల బాండ్ ఇష్యూతో పాటు దీర్ఘకాలిక రుణాలపై కూడా రిలయన్స్ దృష్టి పెట్టినట్లు సమాచారం. ఇందులో భాగంగా 10 ఏళ్ల మెచ్యూరిటీ కలిగిన బాండ్లను కూడా జారీ చేసే అవకాశాన్ని కంపెనీ పరిశీలిస్తోందట. ఇందుకు సంబంధించి బ్యాంకర్లు, పెద్ద ఇన్వెస్టర్లతో చర్చలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. మొత్తంగా చూస్తే.. దేశీయ రుణ మార్కెట్‌లో రిలయన్స్ రీఎంట్రీ భారీ నిధుల సమీకరణకు తెరతీయడంతో పాటు కార్పొరేట్ బాండ్ మార్కెట్‌పై కూడా గణనీయమైన ప్రభావం చూపే అవకాశం ఉందని చర్చించుకుంటున్నారు.

పండుగల వేళ ఛార్జీలకు రెక్కలు.. భారీగా పెంచేసిన విమాన సంస్థలు



త్వరలో దేశంలో దసరా, దీపావళి పండుగలు రానున్నాయి. ఈ కీలక పండుగల వేళ సహజంగానే విపరీతమైన రద్దీ ఉంటుంది. దీంతో ఈ అవకాశాన్ని విమాన సంస్థలు క్యాష్ చేసుకోవాలని భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో భారీగా ధరలు పెంచేశాయి. కొన్ని రూట్లలో అయితే దారుణాతీదారుణంగా పెంచేశాయి. ఒక్కసారిగా ధరలు ఆకాశాన్నంటాయి. పెరిగిన ధరలతో జేబులు ఖాళీ అయ్యేటట్టు కనిపిస్తున్నాయి. దేశీయ విమాన ప్రయాణికులకు పండుగల సీజన్‌లో షాక్ తగులుతోంది. దీపావళి, వినాకయ చవితి, దుర్గాపూజ వంటి పండుగల నేపథ్యంలో విమాన టికెట్ ధరలు భారీగా పెరిగాయి. ముఖ్యంగా ఒకే విమానయాన సంస్థ సర్వీసులు అందించే రూట్లలో ధరలు మరింత వేగంగా పెరిగినట్లు ట్రావెల్ మార్కెట్ గణాంకాలు సూచిస్తున్నాయి. సీట్ల లభ్యత తగ్గిపోవడం, డిమాండ్ భారీగా పెరగడం, పరిమిత విమాన సామర్థ్యం కారణంగా కొన్ని మార్గాల్లో టికెట్ ధరలు సాధారణ ధరలతో పోలిస్తే 50 శాతం నుంచి 150 శాతానికి పైగా పెరిగాయి. దీపావళి సందర్భంగా సొంతూళ్లకు వెళ్లేందుకు ప్రయాణికులు పెద్ద ఎత్తున విమాన టికెట్లు బుక్ చేసుకుంటున్నారు. దీంతో ఢిల్లీ-పాట్నా వంటి అధిక డిమాండ్ ఉన్న మార్గాల్లో ధరలు భారీగా పెరిగాయి. సాధారణ రోజుల్లో ఈ రూట్‌లో నాన్‌స్టాప్ ఎకానమీ టికెట్ ధర సుమారు రూ.3,500-4,500 మధ్య ఉంటుంది. అయితే పీక్ డేట్లలో ఇదే టికెట్ ధర రూ.12,500కు పైగా చేరింది. చివరి నిమిషంలో బుక్ చేసుకునే నాన్‌స్టాప్ టికెట్ల ధర రూ.13,500 దాటుతున్నట్లు తెలుస్తోంది. ఒకే ఎయిర్‌లైన్‌కు ప్రత్యేకంగా ఉన్న కొన్ని ప్రాంతీయ రూట్లలో ధరల పెరుగుదల మరింత తీవ్రంగా ఉంది. దుర్గాపూజ సందర్భంగా కోల్‌కతా-దియోఘర్ నాన్‌స్టాప్ విమాన టికెట్ సాధారణంగా రూ.2,800 దగ్గర ఉండగా..

పీక్ సీజన్‌లో అది రూ.12,500కు చేరింది. అంటే దాదాపు 340 శాతం పెరిగింది. అలాగే ఢిల్లీ-అగట్టి (లక్షద్వీప్) రూట్‌లో సాధారణంగా రూ.8,500గా ఉండే టికెట్ ధర పీక్ అక్టోబర్ సెలవుల్లో రూ.25,000కు చేరింది. ఇది సుమారు 194 శాతం పెరుగుదల. దీపావళి సమయంలో బెంగళూరు-ఝార్సుగూడ నాన్‌స్టాప్ టికెట్ల ధర సాధారణంగా రూ.4,200 ఉండగా.. ప్రస్తుతం రూ.16,200కు చేరింది. అంటే దాదాపు 285 శాతం పెరిగింది.

ముంబై-బరేలీ మార్గంలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. సాధారణ ధర రూ.4,500 నుంచి రూ.15,000కు పైగా పెరిగింది. నేరుగా పోటీ చేసే విమాన సర్వీసులు పరిమితంగా ఉండటం, డైనమిక్ ప్రైసింగ్ కారణంగా ధరలు భారీగా పెరుగుతున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. ఢిల్లీ-కోల్‌కతా నాన్‌స్టాప్ విమాన టికెట్ల ధరలు సాధారణ రోజుల్లో రూ.4,800 వరకు ఉండగా.. పీక్ సీజన్‌లో రూ.12,300కు పైగా చేరాయి. ఇక ఢిల్లీ-బెంగళూరు వంటి ప్రధాన రూట్లలో టికెట్ ధరలు సుమారు రూ.10,000కు చేరాయి.

ఈ ఏడాది నిఫ్టీ 7 శాతం పతనం..!



దేశీయ స్టాక్ మార్కెట్లలో ఈ ఏడాది మిశ్రమ ధోరణి కనిపిస్తోంది. బెంచ్‌మార్క్ సూచీ నిఫ్టీ-50 నష్టాల్లో కొనసాగుతుండగా.. స్మాల్‌క్యాప్ షేర్లు మాత్రం

భారీ లాభాలను నమోదు చేస్తున్నాయి. 2026లో ఇప్పటివరకు నిఫ్టీ-50 దాదాపు 7 శాతం క్షీణించగా, నిఫ్టీ స్మాల్‌క్యాప్-100 సూచీ సుమారు 13 శాతం లాభపడింది. పశ్చిమాసియా ఉద్రిక్తతలు, ఇంధన ధరల పెరుగుదల వంటి అంతర్జాతీయ పరిణామాలు మార్కెట్లపై ఒత్తిడి పెంచుతున్నప్పటికీ, స్మాల్‌క్యాప్ విభాగం మాత్రం బలంగా నిలిచింది.

రానున్న కాలంలో విద్యుత్ రంగానికి మంచి వృద్ధి అవకాశాలు ఉన్నాయని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

మళ్లీ భగ్గుమంటున్న క్రూడాయిల్

న్యూఢిల్లీ, : పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ముడి చమురు ధరలు 100 డాలర్లను దాటింది. దీంతో స్టాక్ మార్కెట్లతో పాటు దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం కనిపిస్తోంది. అమెరికా-ఇరాన్ యుద్ధం కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు మళ్లీ చుక్కలను తాకుతున్నాయి. సౌదీ అరేబియా ఇంధన ఉత్పాదక కేంద్రాలపై హౌతీ మిలిటెంట్లు డ్రోన్లు, క్షిపణులతో దాడి చేయడంతో పశ్చిమాసియాలో టెన్షన్ వాతావరణం మరింత పెరిగింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు రేటు మరోసారి 100 డాలర్లను సమీపించింది. దీంతో మిడిల్ ఈస్ట్‌లో అశాంతి పెరిగితే క్రూడాయిల్ ధరలు మరింత పెరిగే అవకాశాలున్నాయి.దేశ ఇంధన అవసరాలు దాదాపు 90 శాతం దిగుమతుల ద్వారానే తీరుతున్నాయి. ఇందులో రష్యాతోపాటు మిడిల్ ఈస్ట్ దేశాల వాటానే ఎక్కువ. అయితే యుద్ధంతో యూఏఈ, సౌదీ, ఖతార్, బహ్రెయిన్, కువైట్ తదితర గల్ఫ్ దేశాల నుంచి భారత్‌కు ముడి చమురు, గ్యాస్ రాక ఇబ్బందికరంగా మారింది. పెట్రో ఉత్పత్తుల రవాణాకు కీలకమైన హ్ఫార్ముజ్ జలసంధిలో నౌకల ప్రయాణం ప్రమాదకరంగా మారింది. నౌకలపై దాడులు జరిగితే బ్యారెల్ విలువ 120 డాలర్లను తాకే అవకాశం ఉంది. అమెరికాకు మద్దతిస్తున్నాయని గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులకు దిగుతోంది.మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతలు దేశీయ మార్కెట్‌లో పెట్రో ధరల పెంపునకు దారితీస్తున్నాయి. పశ్చిమాసియా సంక్షోభం వల్ల భారత ఆర్థిక వ్యవస్థ ఒత్తిడికి లోనవుతోంది. చమురు దిగుమతుల చెల్లింపుల భారం, ఇంధన ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం విజృంభణ, రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్ల పెంపు, స్టాక్ మార్కెట్లలో ఒడిదుడుకులు, రూపాయి మారకం విలువ క్షీణత, చమురు ఆధారిత ఉత్పత్తుల తయారీ ఖరీదెక్కడం, ఎగుమతుల పతనం వంటివి దేశ ఎకానమీని రిస్క్‌లో పడేస్తున్నాయి.ఈ ఏడాది ఫిబ్రవరి 28న యుద్ధం ప్రారంభం కాగా, అప్పట్నుంచి ఇప్పటిదాకా దేశంలో లీటర్ పెట్రోల్ రేటు రూ.7.35, డీజిల్ ధర రూ.7.53 పెరిగింది. అమెరికాతో ఇరాన్ చర్చల కారణంగా అప్పట్లో కొంతమేర శాంతియుత పరిస్థితులు మిడిల్ ఈస్ట్‌లో నెలకొన్నాయి. ఇది మార్కెట్‌లో క్రూడ్ ధరల తగ్గుముఖానికి కలిసొచ్చింది. అయితే మళ్లీ దాడులు మొదలవడంతో పరిస్థితి మొదటికొచ్చింది. ఇక ఈ ఏడాది ఏప్రిల్-జూలైలో భారత ముడి చమురు దిగుమతుల విలువ 56 శాతం పెరిగి 63.4 బిలియన్ డాలర్లకు చేరింది. నిరుడు ఇదే సమయంలో 40.5 బిలియన్ డాలర్లేనని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.

ఫీల్డ్ లో పనితోనే గుర్తింపు

వన్ స్టేట్-వన్ విజన్-వన్ టీమ్'

విజయవాడ, : "గంటల తరబడి చేసే రివ్యూలు కాదు... నాకు క్షేత్రస్థాయిలో ఫలితాలు కావాలి. రియాక్టివ్ (ప్రతిస్పందించే) పాలన నుంచి ప్రో-యాక్టివ్ (చురుకైన) పాలన దిశగా అధికారులు మారాలి. ఆలోచనలు అద్భుతంగా ఉన్నా, వాటిని అమలు చేయకపోతే అవి నెరవేరని ఆశలుగానే మిగిలిపోతాయి" అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులకు స్పష్టమైన సందేశం ఇచ్చారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం ప్రారంభమైన 8వ జిల్లా కలెక్టర్ల సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. రెండు రోజుల పాటు మొత్తం 12 గంటల పాటు సాగే ఈ కీలక సదస్సులో తొలిరోజు, పాలనలో తీసుకురావాల్సిన మార్పులు, అభివృద్ధి లక్ష్యాలపై ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు.ప్రజా సేవకులుగా అహంభావాలకు తావివ్వకుండా పనిచేయాలని నూచించిన ముఖ్యమంత్రి, నాయకత్వ లక్షణాలు ప్రదర్శించాలంటే ముందుగా యాజమాన్య బాధ్యత (ఓనర్‌షిప్) తీసుకోవడం అలవర్చుకోవాలని హితవు పలికారు. "ఫైల్ పెండింగ్‌లో ఉందంటే అభివృద్ధి పెండింగ్‌లో ఉన్నట్టే. ఫిర్యాదు పెండింగ్‌లో ఉందంటే ప్రజలకు న్యాయం ఆలస్యమవుతున్నట్టే. ప్రభుత్వాన్ని మభ్యపెట్టే నివేదికలు వద్దు, వాస్తవాలు నిర్భయంగా చెప్పండి. సమస్యను దాచిపెడితే అది పెద్దదవుతుంది, కానీ దానిపై బహిరంగంగా చర్చిస్తే పరిష్కారం లభిస్తుంది. సాధారణ పరిపాలన కాదు, ప్రజలు మెచ్చే సుపరిపాలన అందించాలి. ఇందుకోసం శాఖలు, జిల్లాలు, సెక్రటరీలు, కలెక్టర్లు ఒకరితో ఒకరు ఆరోగ్యకరంగా పోటీపడాలి. 'వన్ స్టేట్-వన్ విజన్-వన్ టీమ్-వన్ మిషన్'... ఇదే మనందరినీ స్వర్ణాంధ్ర లక్ష్యం వైపు నడిపిస్తుంది" అని చంద్రబాబు ఉద్ఘాటించారు.సీఈఓ' కన్నా 'వాటర్ మ్యాన్' గుర్తింపే ఆనందంఈ సందర్భంగా, సాగునీటి రంగంలో ప్రభుత్వం సాధించిన ప్రగతిపై ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ, ఎకనమిక్ టైమ్స్ పత్రిక ముఖ్యమంత్రిని 'సీఈఓ టు వాటర్‌మ్యాన్' అంటూ ప్రచురించిన కథనాన్ని ప్రస్తావించారు. దీనికి స్పందించిన సీఎం చంద్రబాబు, ఆ గుర్తింపు తనకు ఎంతో ఆనందాన్నిచ్చిందని అన్నారు.

"గతంలో గ్లోబల్ డ్రీమ్ కేబినెట్‌లో నా పేరు వచ్చినప్పుడు గానీ, నన్ను సీఈఓ సీఎం అన్నప్పుడు గానీ నేను ఇంతలా సంతోషించలేదు. రాష్ట్రంలోని కరవు ప్రాంతాలకు, భౌగోళిక అసమానతల కారణంగా నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న ప్రాంతాలకు నీటిని అందించగలిగినప్పుడే నాకు నిజమైన సంతృప్తి. ఆ నీటి భద్రత, సంరక్షణ చర్యలను గుర్తించి 'వాటర్ మ్యాన్' అని పేరు పెట్టినందుకు సంతోషంగా ఉంది" అని ఆయన భావోద్వేగంగా అన్నారు. ఈ వ్యాఖ్యల అనంతరం సాగునీటి రంగంలో ముఖ్యమంత్రి కృషికి అభినందనగా సమావేశంలో ఉన్న కలెక్టర్లు, అధికారులు, మంత్రులు లేచి నిలబడి చప్పట్లతో (స్టాండింగ్ ఓవేషన్) గౌరవం తెలిపారు.

టీమ్ విజయంతోనే అభివృద్ధి సాధ్యం

గడిచిన 27 నెలల్లో రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగంగా ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టామని, రూ.1.40 లక్షల కోట్లు సంక్షేమానికి, రూ.1.50 లక్షల కోట్లు అభివృద్ధికి ఖర్చు చేశామని సీఎం వివరించారు. "హంద్రీనీవా, వెలిగొండ ఫేజ్-1, పోలవరం ఎడమ కాలువ ద్వారా నీళ్లిచ్చాం. పోలవరం ప్రాజెక్టును మార్చి 2027 నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. ఈ విజయాలన్నీ ఏ ఒక్కరి వల్లో సాధ్యం కాలేదు. ప్రధాని మోదీ, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహకారంతో పాటు మంత్రులు, అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు అందరూ ఒక జట్టుగా పనిచేయడం వల్లే ఇది సాధ్యమైంది. ఇది టీమ్ సక్సెస్" అని చంద్రబాబు పేర్కొన్నారు.ప్రతి జిల్లాలో 25 ప్రధాన ప్రాజెక్టులను, ప్రతి నియోజకవర్గంలో 10-15 ప్రాధాన్యతాంశాలను గుర్తించి వాటిని పూర్తి చేయాలని కలెక్టర్లకు ఆదేశించారు.

బాపు టార్గెట్ తో గులాబీ దళం యాక్టివ్



హైదరాబాద్, రాజకీయాల్లో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను టార్గెట్ చేయడం వల్ల కాంగ్రెస్‌కు లాభమా లేదా నష్టమా అనేది చర్చనీయాంశమైంది. నేటికీ కేసీఆర్ పట్ల తెలంగాణను తెచ్చారన్న అభిప్రాయం ఉంది. ఆయన పాలన శైలి నచ్చకపోవచ్చు కానీ, ఆయనంటే తెలంగాణ ప్రజలకు గౌరవం అనేది తరగనిది. కానీ కాంగ్రెస్ ఇటీవల కాలంలో కేసీఆర్ ను లక్ష్యంగా చేసుకుని వ్యవహరించడం రాజకీయం గానష్టమేనన్న అంచనాలు వినపడుతున్నాయి . కాంగ్రెస్ ఎమ్మెల్యే శంకర్ తాము కేసీఆర్ చావును కోరుకుంటున్నామని చెప్పడం, ఎర్రవెల్లి ఫామ్ హౌస్ ముట్టడికి ప్రయత్నించడం వంటివి బీఆర్ఎస్ కు కలసి వచ్చే అంశమని భావిస్తున్నారు. కేసీఆర్ తెలంగాణ ఉద్యమ నేతగా, రెండు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి. ఆయనపై వ్యక్తిగత విమర్శలు లేదా తీవ్రమైన దాడులు ప్రజల్లో ఆయన పట్ల సానుభూతి నింపెంచే అవకాశం ఉంది.అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఆరు గ్యారంటీలు, ప్రజల సమస్యలపై దృష్టి పెట్టకుండా, కేవలం ప్రతిపక్ష నేతను వేధించడానికే ప్రాధాన్యత ఇస్తోందనే అభిప్రాయం సాధారణ ప్రజల్లో బలపడితే అది కాంగ్రెస్‌కు రాజకీయంగా నష్టం కలిగిస్తుంది. కేసీఆర్ శాసనసభకు రాకుంటే, ప్రజాసమస్యలను ప్రస్తావించకుంటే ఆయనకే నష్టం. ఎన్నికల సమయంలో జనం తగిన రీతిలో తీర్పు చెబుతారు. కేసీఆర్ కేవలం అసెంబ్లీ సమావేశాలకు మాత్రమే కాదు...ప్రజా సమస్యలపై రాష్ట్రంలో పర్యటించలేదు. కానీ కేసీఆర్ సభకు రాలేదంటూ నిరసనలు తెలియజేయడం, ఎమ్మెల్సీ స్పీకర్ ను తిడితే ఫామ్ హౌస్ ముట్టడికి ప్రయత్నించడం కొంత కాంగ్రెస్ కు రాజకీయంగా ఇబ్బందికరంగా మారుతుందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి.. కేసీఆర్‌ను టార్గెట్ చేయడం వల్ల నిస్తేజంగా ఉన్న బీఆర్ఎస్ కేడర్ ఒక్కసారిగా అప్రమత్తమై, కాంగ్రెస్ సర్కార్‌పై ఎదురుదాడికి దిగే అవకాశం ఉంది.అయితే కాంగ్రెస్‌కు లాభం జరిగే అవకాశాలు కూడా ఉన్నాయంటున్నారు. కాంగ్రెస్ ఎజెండా ప్రకారం బీఆర్ఎస్, కేసీఆర్‌లను నిరంతరం టార్గెట్ చేయడం ద్వారా రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్సేనని, బీజేపీకి అక్కడ చోటు లేదనే సంకేతాన్ని ప్రజల్లోకి పంపవచ్చు. దీనివల్ల ప్రతిపక్ష ఓట్లు చీలిపోకుండా చూసుకోవచ్చు కేసీఆర్ హయాంలో జరిగిన లోపాలను (ఉదాహరణకు కాళేశ్వరం ప్రాజెక్టు సమస్యలు, ధరణి లోపాలు) నిరంతరం ప్రస్తావించడం ద్వారా, తాము ఎందుకు అధికారంలోకి రావాల్సి వచ్చిందో ప్రజలకు కాంగ్రెస్ సమర్థించుకోగలుగుతుంది. తమ నాయకత్వం బలంగా ఉందని, కేసీఆర్ వంటి సీనియర్ నేతను సైతం ఢీకొట్టగలదని చూపించడం ద్వారా కాంగ్రెస్ కార్యకర్తలలో ధైర్యాన్ని నింపవచ్చు. .. రాజకీయంగా విమర్శలు చేయడం సహజమే అయినప్పటికీ, అది వ్యక్తిగత దూషణలు, శృతిమించిన దాడుల స్థాయికి వెళ్తే మాత్రం కాంగ్రెస్‌కు నష్టం జరిగే అవకాశాలే ఎక్కువగా ఉంటాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రజలు ఎప్పుడూ ప్రస్తుత ప్రభుత్వ పనితీరు, ఇచ్చిన హామీల అమలును బట్టే తీర్పు ఇస్తారు కానీ, కేవలం ప్రతిపక్షాన్ని టార్గెట్ చేయడం వల్ల మాత్రమే ఓట్లు పడవు.

ఏపీ రాజకీయాల్లో చర్చనీయాంశంగా బొత్స..!



విజయనగరం, : ఉత్తరాంధ్ర రాజకీయంలో ఏ సవాలు ఎదురైనా నవ్వుతూ ఎదుర్కొనే సీనియర్ నేత, వైఎస్ఆర్‌సీపీ అగ్రనాయకుడు బొత్స సత్యనారాయణ వైఖరిలో కనిపిస్తున్న మార్పు ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రత్యర్థులను ఏడిపించడం తప్ప ఏనాడూ ధైర్యం సడలని బొత్స, ఇటీవల వరుస పరిణామాలతో పూర్తిగా ఆత్మరక్షణలో పడిపోయినట్లు కనిపిస్తున్నారు. తాజాగా తన సొంత నియోజకవర్గం చీపురుపల్లి పరిధిలోని గరివిడిలో నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన కన్నీటిపర్యంతమయ్యారు. రాజకీయాల్లో ఎన్నో ఒడిదుడుకులు, గెలుపోటములు, తీవ్రమైన సంక్షోభాలను అత్యంత ధైర్యంగా తట్టుకున్న బొత్స.. ఒక్కసారిగా భావోద్వేగానికి లోనై కార్యకర్తల ముందే కన్నీళ్లు పెట్టుకోవడం చూసి అక్కడున్న వారంతా ఆశ్చర్యపోయారు.బొత్స ఈ స్థాయిలో కుంగిపోవడానికి క్షేత్రస్థాయిలో మారుతున్న రాజకీయ సమీకరణాలే కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, బొత్సకు అత్యంత ఆప్తుడైన మజ్జి శ్రీనివాసరావు తన కుమార్తెతో సహా వైఎస్ఆర్‌సీపీని వీడి టీడీపీలో చేరడం జిల్లాలో బొత్స ఆధిపత్యానికి పెద్ద దెబ్బగా మారింది. దశాబ్దాలుగా బొత్స వెంటే నడిచిన ద్వితీయ శ్రేణి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఒక్కొక్కరుగా కూటమి పార్టీల వైపు చూస్తుండటంతో, చీపురుపల్లితో పాటు ఉమ్మడి జిల్లాలో పార్టీ భవిష్యత్తుపై ఆయనలో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోందని భావిస్తున్నారు. విజయనగరం జిల్లాలో బొత్స తరపున ఆయన వర్గాన్ని నడిపించింది మజ్జి శ్రీనివాసరావే. చీపురుపల్లి నియోజకవర్గంలో బొత్స గతంలో వరుసగా విజయం సాధిస్తూ రావడానికి కారణం చిన్న శీనేనని చెబుతారు. అలాంటి నేత తనను వదిలేసి టీడీపీలో చేరడంతో బొత్స ఇబ్బంది పడుతున్నారుగతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పిసిసి అధ్యక్షుడిగా, వైఎస్ఆర్‌సీపీ హయాంలో సీనియర్ మంత్రిగా చక్రం తిప్పిన బొత్స సత్యనారాయణ.. ఇప్పుడు సొంత నియోజకవర్గంలో కూడా క్యాడర్‌ను కాపాడుకోలేని స్థితికి చేరుకున్నారనే చర్చ సాగుతోంది. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ, ఉత్తరాంధ్రలో పార్టీ ఖాళీ అవుతుండటం, శ్రేణులు నిరాశలో కూరుకుపోవడం ఆయనను మానసికంగా ఒత్తిడికి గురిచేస్తోందని తెలుస్తోంది. ధైర్యంగా ముందుకు నడపాల్సిన నాయకుడే కన్నీరు పెట్టుకోవడంతో కార్యకర్తలు కూడా ఏం చేయాలో పాలుపోక అయోమయంలో పడ్డారు.గరివిడి ఘటన ఉత్తరాంధ్ర వైఎస్ఆర్‌సీపీలో నెలకొన్న అంతర్గత నైతిక స్థైర్య పతనానికి అద్దం పడుతోంది. ఎన్నో సంక్షోభాలను తట్టుకుని నిలబడిన బొత్స సత్యనారాయణ వంటి సీనియర్ నేత కూడా ఇన్ని ప్రతికూలతల మధ్య నిస్సహాయత వ్యక్తం చేయడం.. రాబోయే రోజుల్లో విజయనగరం జిల్లా రాజకీయాల్లో మరింత కీలక పరిణామాలకు దారితీసే అవకాశం కనిపిస్తోంది

ఉద్యమాల గడ్డ నుంచే తొలి పారు



వరంగల్, : తెలంగాణ రాజకీయ యవనికపై సరికొత్త అధ్యాయానికి తెరలేపిన కల్వకుంట్ల కవిత, తన కొత్త రాజకీయ వేదిక తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) తొలి సమరానికి చారిత్రక నగరం వరంగల్‌ను ఎంచుకున్నారు. ఉద్యమాలకు, రాజకీయ చైతన్యానికి మారుపేరైన ఓరుగల్లు గడ్డ నుంచే తన పార్టీ ఎన్నికల ప్రస్థానం మొదలుకానుందని హనుమకొండ వేదికగా కవిత ప్రకటించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లలోనూ తమ పార్టీ ఒంటరిగానే బరిలోకి దిగుతుందని వెల్లడించారు. సరికొత్త పేరు, పాత సెంటిమెంట్‌ల కలబోతతో ప్రజాక్షేత్రంలోకి వచ్చిన కవితకు ఈ స్థానిక సంస్థల ఎన్నికలు పార్టీ మనుగడను, భవిష్యత్ రాజకీయ బలాన్ని నిర్ణయించే కీలక అగ్నిపరీక్షగా మారనున్నాయి.కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశాన్ని అస్త్రంగా చేసుకుని కవిత రంగంలోకి దిగారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న దాదాపు రూ.13వేల కోట్ల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలనే డిమాండ్‌తో ఆమె నిరసన బాట పట్టారు. హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించిన కవిత, అనంతరం కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు.రాజకీయాల్లో కొత్తగా ఆవిర్భవించిన ఏ పార్టీకైనా క్షేత్రస్థాయి క్యాడర్ బలం, ఓటు బ్యాంక్ నిర్మాణమే అతిపెద్ద సవాలు. కవిత తెలంగాణ రక్షణ సేనను ప్రకటించిన నాటినుంచీ ఆమె రాజకీయ ప్రభావం ఎంతవరకు ఉంటుందనే సందేహాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. సరిగ్గా ఈ తరుణంలో గ్రేటర్ వరంగల్ పరిధిలోని అన్ని డివిజన్లలో పోటీ చేయాలనే నిర్ణయం ఆ పార్టీకి ఒక కత్తిమీద సాము వంటిది.వరంగల్ కార్పొరేషన్ పరిధిలో ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ ఇప్పటికే పటిష్టమైన క్యాడర్‌తో ఉన్నాయి. అలాంటి త్రిముఖ పోటీ వాతావరణంలో టీఆర్ఎస్ తనకంటూ సొంత ఓటు శాతాన్ని రాబట్టుకోగలదా లేదా అన్నది ఈ ఎన్నికల్లోనే తేలిపోనుంది. అన్ని డివిజన్లలో అభ్యర్థులను నిలబెట్టడం ద్వారా క్షేత్రస్థాయిలో పార్టీ యంత్రాంగాన్ని నిర్మించుకోవడమే కవిత వ్యూహంగా కనిపిస్తోంది. అయితే, బలమైన అసంతృప్త నేతలను తమ వైపు తిప్పుకోవడంలో పార్టీ ఎంతవరకు సఫలీకృతమవుతుందనేది కీలకం. 'తెలంగాణ రక్షణ సేన' పేరుతో ప్రజల్లో సెంటిమెంట్‌ను రగిలించి, ప్రజా సమస్యల ద్వారా పాలకులపై పోరాడటం ద్వారా తృతీయ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగాలని కవిత ఆశిస్తున్నారు.రాష్ట్ర రాజకీయాల్లో తాము నామమాత్రపు పాత్రధారులం కాదని, ప్రత్యర్థులకు గట్టి సవాలు విసరగల పూర్తిస్థాయి ప్రత్యామ్నాయ శక్తినని నిరూపించుకోవాల్సిన బాధ్యత ఇప్పుడు కవితపై ఉంది. వరంగల్ కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలు కవిత కొత్త ప్రస్థానానికి నైతిక స్థైర్యాన్ని ఇస్తాయా, లేక ఎదురీతను తప్పించవా అనేది త్వరలోనే తేలనుంది. ఈ ఎన్నికల వేదికపై తెలంగాణ రక్షణ సేన ప్రదర్శించే ప్రభావమే ఆ పార్టీ భవిష్యత్ రాజకీయ మనుగడను దిశానిర్దేశం చేయనుంది

మెగా డీఎస్సీ ప్రక్రియలో భారీ అవకతవకలు జరిగాయన్న జగన్



విజయవాడ, : ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన మెగా డీఎస్సీ నియామక ప్రక్రియలో భారీ అవకతవకలు జరిగాయని వైసీపీ అధినేత జగన్ మరోసారి ఆరోపించారు. తప్పులను కప్పిపుచ్చుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోందని అన్నారు. శాసనసభ వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అసత్యాలు ప్రచారం చేశారని ధ్వజమెత్తారు. ఈ భారీ కుంభకోణానికి సంబంధించిన అన్ని ఆధారాలను త్వరలోనే సమగ్రంగా ప్రజల ముందుకు తీసుకొస్తానని స్పష్టం చేశారు. ప్రశ్నపత్రాల తయారీ, పరీక్షల నిర్వహణ బాధ్యతలను ఒకే ఒక్క వ్యక్తికి/సంస్థకు ఎలా అప్పగిస్తారని జగన్ ప్రశ్నించారు. ఎస్సీఈఆర్‌టీ విభాగంలో పనిచేస్తున్న నవీన్ అనే అభ్యర్థికి ఫస్ట్ ర్యాంక్ ఎలా వచ్చింది? అసలు మొదటి ర్యాంక్ సాధించిన నవీన్‌కు ఉద్యోగం ఎందుకు నిరాకరించారు? అని ప్రశ్నించారు.జీవో నంబర్ 4, జీవో నంబర్ 47లను తీసుకొచ్చి స్పోర్ట్స్ కోటా నిబంధనలను ఎందుకు మార్చారు? పరీక్షలు నిర్వహించకుండానే 372 మందికి నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు కట్టబెట్టడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటి? అని ప్రశ్నించారు. 'జూడో' అనే ఆట కింద ఏకంగా 39 మందికి అక్రమంగా సర్టిఫికెట్లు సృష్టించి ఉద్యోగాలు ఇచ్చారని ఆరోపించారు.మెగా డీఎస్సీ అక్రమాలపై తమ పార్టీ ఆధారాలతో సహా నిలదీస్తుంటే ముఖ్యమంత్రి చంద్రబాబుకు కోపం వచ్చి బీపీ పెరుగుతోందని, మంత్రి నారా లోకేశ్ ను కాపాడుకోవడానికి ప్రభుత్వం తాపత్రయపడుతోందని జగన్ ఎద్దేవా చేశారు. ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులు, జర్నలిస్టులపై తప్పుడు కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. డీఎస్సీ స్కామ్‌కు మూలకారణం పారదర్శకతకు పాతిపెట్టడమేనని జగన్ విమర్శించారు. రాష్ట్ర చరిత్రలోనే ఎన్నడూ లేనివిధంగా ప్రశ్నాపత్రాల తయారీ, పరీక్షల నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలన్నింటినీ ఒకే ఒక్క వ్యక్తి చేతిలో ఎందుకు పెట్టారని నిలదీశారు. ఎస్సీఈఆర్టీ లో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిగా చేసిన వ్యక్తికి ఫస్ట్ ర్యాంక్ ఎలా వచ్చిందో, ఆ తర్వాత అతని ఐడీని బ్లాక్ చేసి మెరిట్ లిస్టులను ఎందుకు మార్చారో ప్రభుత్వం సమాధానం చెప్పలేకపోయిందన్నారు. కనీసం టెట్ అర్హత లేనివారికి, ఒక కేటగిరీ మార్కులను మరో పోస్టుకు వర్తింపజేసి, చివరికి రూల్ ఆఫ్ రిజర్వేషన్లకు పాతరేసి మరీ దొంగచాటుగా ఉద్యోగాలు కట్టబెట్టారని ఆరోపించారు.స్పోర్ట్స్ కోటా పేరుతో జరిగిన అక్రమాలు ఈ స్కామ్‌లో మరీ దారుణమని జగన్ సంచలన ఆధారాలు బయటపెట్టారు. గతంలో ఉన్న 2% స్పోర్ట్స్ కోటాను 3 శాతానికి పెంచి, పరీక్షలు కూడా లేకుండా నేరుగా ఉద్యోగాలు ఇచ్చేలా జీవో 4, 47లను తీసుకొచ్చి, పని పూర్తయ్యాక జీవో 23, 56లతో గేట్లు మూసేశారని ఆరోపించారు. ఖమ్మంలో జరగని సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూడో ఛాంపియన్‌షిప్-2013 పోటీలలో పాల్గొన్నట్లు ఏపీ జూడో అసోసియేషన్ ఇచ్చిన తప్పుడు సర్టిఫికెట్లతో ఏకంగా 39 మందికి పరీక్షలు లేకుండా టీచర్ పోస్టులు ఇచ్చారన్నారు. అసలు ఆ తేదీల్లో పోటీలే జరగలేదని తెలంగాణ, ఖమ్మం జూడో అసోసియేషన్లు రాతపూర్వకంగా స్పష్టం చేశాయని, ఆశ్చర్యకరంగా ఏపీ జూడో అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్నది లోకేష్ తోడల్లుడు, విశాఖ ఎంపీ భరత్ అని జగన్ ఎత్తిచూపారు.అలాగే టీడీపీ ఎమ్మెల్యే కూన రవికుమార్ అధ్యక్షుడిగా ఉన్న సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ద్వారా 38 మందికి, జరగని నేషనల్ ఖో-ఖో పోటీల పేరుతో మరికొందరికి పరీక్షలు లేకుండానే పోస్టులు కట్టబెట్టారని జగన్ ఆరోపించారు. విశాఖపట్నంలో యోగేశ్వర్‌రావు అనే అభ్యర్థికి, అతని చెల్లెలికి ఖో-ఖో బోగస్ సర్టిఫికెట్లతో ఎస్‌జీటీ పోస్టులు ఇచ్చారని, తెలంగాణ ఖో-ఖో అసోసియేషన్ రిలీజ్ చేసిన విజేతల జాబితాలో వీరి పేర్లే లేవని నిరూపించారు. కర్నూలు జిల్లాలో ఈడిగ ప్రభాకర్ అనే అభ్యర్థికి కనీస అర్హత మార్కులు రాకపోయినా, స్కూల్ అసిస్టెంట్ మార్కులను చూపిస్తూ ఎస్‌జీటీ పోస్టు కట్టబెట్టిన తీరును డీఈవో కూడా ఒప్పుకున్నారని గుర్తుచేశారు.

బడి ఉన్నంతకాలం విప్లవం ఉంటుంది...!

"విద్యార్థులతో తరగతి గదులు, టీచర్లతో పాఠశాలలు క్యూబాలో వున్నంత కాలమూ దేశం వుంటుంది, మాతృభూమి వుంటుంది. విప్లవం కూడా వుంటుంది. సోషలిజం కూడా వుంటుంది." అని క్యూబా అధ్యక్షులు, క్యూబా కమ్యూనిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ ఫస్ట్ కార్యదర్శి అయిన డియాజ్ కానెల్ మంగళవారం వ్యాఖ్యానించారు. ఉపాధ్యాయుడు మెండివ్ యువ మార్టికి బోధిస్తున్న పాఠశాల ఆనవాళ్ళను కలిగివున్న ప్రదేశమైన పాత హవానాలోని ప్రముఖ పాసియో డెల్ ప్రాడియోలో క్యూబా అధ్యక్షుని పత్రికా బృందంతో డియాజ్ కానెల్ మాట్లాడారు. ఈ ఏడాది విద్యా సంవత్సరాన్ని ప్రారంభించడం ప్రతి ఒక్కరి గురుతర బాధ్యత అని కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన వ్యాఖ్యానించారు. క్యూబా విప్లవ యోధుడు ఫైడెల్ కాస్ట్రోకు ఇది ఘనమైన నివాళి అని పేర్కొన్నారు. చుట్టూ పిల్లలు, టీనేజర్లు, యువకులు అందరూ గుమిగూడి వుండగా ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మూడు ముఖ్య అంశాలను విలేకర్లతో పంచుకున్నారు. అందులో మొదటిది ఈ ఏడాది పాఠశాల విద్యా సంవత్సరం ప్రారంభంతో తరగతి గదుల్లో నెలకొన్న విజయమని ప్రస్తావించారు. రెండవది, సమిష్టి ప్రయత్నంతో సాధించిన ఫలితాలని అన్నారు. ఇక మూడవది-మార్పులు, పరివర్తనలతో మునిగిపోయిన సమయంలో బోధనలో, అభ్యాసంలో మనం ఎదుర్కొంటున్న సవాలు అని అన్నారు. అమెరికా సుదీర్ఘ ఆంక్షల కారణంగా తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు, ఇంధన కొరత, ఉపాధ్యాయులు, ఇతర సామాగ్రి, పరికరాలు ఇలా అన్నీ కొరతగానే వున్నా 2026-27 విద్యా సంవత్సరానికి పాఠశాలలను తిరిగి ప్రారంభించాలన్న క్యూబా ధృఢ నిశ్చయాన్ని అధ్యక్షులు ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. విద్య పట్ల విప్లవానికి వున్ననిబద్ధత, జాతీయ ధృఢత్వానికి ఇదొక నిదర్శనంగా కనిపిస్తోంది. ఎంతటి ప్రతికూల పరిస్థితులెదురైనా విద్యను కొనసాగించాల్సిందేనని స్పష్టం చేశారు. తరగతి గదుల్లోనే విజయం నెలకొంటుందని అన్నారు. విద్యా వ్యవస్థను ఎలాగైనా సుస్థిరంగా కొనసాగించాలని ఉపాధ్యాయులు, కుటుంబాలు, కమ్యూనిటీలు, సంస్థలు, వ్యవస్థలు ఇలా అన్నీ భావించాయని, వారందరి సమిష్టి కృషి ఫలితమే ఈ రోజని వ్యాఖ్యానించారు.

విజయసాయిరెడ్డి వెనుక ఉంది ఎవరు..?



నెల్లూరు: ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్ఆర్సీపీకి మొదటి నుంచి ఆయువుపట్టులా వ్యవహరించిన సీనియర్ నేత, మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి సొంతంగా నూతన రాజకీయ పార్టీని స్థాపించబోతున్నారు. ప్రస్తుత రాజకీయాల్లోపార్టీ నడపడం అంటే వందల కోట్ల ఖర్చుతో కూడుకున్నవ్యవహారం. సాధారణంగా ఏ నాయకుడైనా వందల కోట్ల రూపాయల ఆర్థిక వనరులను వెచ్చించి పార్టీ పెడుతున్నారంటే.. తాము ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించడమే లక్ష్యంగా పెట్టుకుంటారు. కానీ, విజయసాయిరెడ్డి మాత్రం కోట్లాది రూపాయల నిధులను, డిజిటల్ మీడియా సామ్రాజ్యాన్ని సిద్ధం చేసుకుంటూనే.. నేను సీఎం కాను, వేరొకరిని సీఎం చేయడానికి మాత్రమే ఈ పార్టీ అని ప్రకటించడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఈ విచిత్రమైన వైఖరి వెనుక పెద్ద ఎత్తున తెరవెనుక సమీకరణాలు, దాగి ఉన్న రాజకీయ వ్యూహాలు ఉన్నాయనే చర్చ నడుస్తోందివిజయసాయిరెడ్డి ప్రతిపాదిత వ్యూహాన్ని నిశితంగా పరిశీలిస్తే.. ఇది కేవలం ఒక పార్టీ స్థాపన మాత్రమే కాకుండా, వోట్ స్ప్లిటర్, ఒక పొలిటికల్ ప్రాక్సీ వ్యూహంలా కనిపిస్తోంది. సొంతంగా మాస్ ఫాలోయింగ్ లేదా నేరుగా సీఎం అయ్యేంత ప్రజాదరణ లేదనే స్పృహ ఆయనకు పక్కాగా ఉంది. అందుకే, ప్రత్యక్షంగా సీఎం పీఠం రేసులో లేనని ప్రకటిస్తూనే, వచ్చే ఎన్నికల్లో నిర్ణయాత్మక ఓటు బ్యాంకును చీల్చడం లేదా కింగ్ మేకర్ పాత్రను పోషించడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రధానంగా రాయలసీమ, కోస్తా జిల్లాల్లో వైఎస్ఆర్సీపీ అసంతృప్త నేతలను, సామాజిక వర్గ సమీకరణాలను తనవైపు తిప్పుకోవడం ద్వారా ఒక 'మూడో శక్తి'గా రూపాంతరం చెంది, గెలుపోటములను ప్రభావితం చేయవచ్చనేది ఆయన వ్యూహంగా కనిపిస్తోంది. ఈ కోట్లాది రూపాయల ప్రయోగానికి అసలు వనరులు ఎక్కడి నుంచి వస్తున్నాయి? ఆయనకు ఉన్న ఆర్థిక అవసరం ఏంటి? అనే అంశంపై రకరకాల కథనాలు ప్రచారంలో ఉన్నాయి. ఒక వర్గం కథనం ప్రకారం.. జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్ఆర్సీపీకి పడే రెడ్డి, ఇతర సంప్రదాయ ఓట్లను చీల్చి, ప్రధాన విపక్షానికి దెబ్బకొట్టేలా తెరవెనుక కొన్ని అధికార శక్తులు ఈ ప్రయోగానికి ఆజ్యం పోస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. స్వయంగా వందల కోట్లు ఖర్చు పెడుతున్నారా లేక గేమ్ ఛేంజర్ గా నిలిపేందుకు అదృశ్య శక్తులు వెనకుండి ఫండింగ్ ఇస్తున్నాయా అనే అనుమానాలు రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. మరోవైపు, ఇది వైఎస్ జగన్‌తో మళ్లీ బార్గెనింగ్ చేయడానికి విజయసాయిరెడ్డి ఆడుతున్న మైండ్ గేమ్ అనే వాదన కూడా బలంగా ఉంది. నేరుగా వైఎస్ఆర్సీపీలోకి వెళ్లే ద్వారాలు మూసుకుపోవడంతో, బయట ఒక రాజకీయ వేదికను, స్వంత డిజిటల్ మీడియా సామ్రాజ్యాన్ని సృష్టించుకోవడం ద్వారా.. జగన్ తన ప్రాధాన్యతను మళ్లీ గుర్తించేలా ఒత్తిడి తేచ్చే యత్నం చేస్తున్నారని భావిస్తున్నారు. తన పార్టీ ద్వారా కొంత ప్రభావం చూపించగలనని నిరూపిస్తే, జగన్ మళ్లీ తగిన స్థానం ఆఫర్ చేస్తారనే దూరదృష్టితోనే "వేరొకరిని సీఎం చేస్తా" అనే పదాన్ని వాడుతున్నారని విశ్లేషిస్తున్నారు.రాజకీయంలో కేవలం డబ్బులు చల్లి, డిజిటల్ మీడియా సంస్థలను నడిపినంత మాత్రాన ఓటర్లు జై కొడతారనుకోవడం అజ్ఞానమే అవుతుంది. గతంలో కూడా కేవలం ఫండింగ్‌ను నమ్ముకుని, వేరే వ్యూహకర్తల డైరెక్షన్‌లో వచ్చిన మూడో ప్రత్యామ్నాయాలు దారుణంగా విఫలమైన చరిత్ర ఏపీకి ఉంది. విజయసాయిరెడ్డి వద్ద ఉన్న వనరుల కోసమో, డిజిటల్ మీడియా నిధుల కోసమో ఆయన చుట్టూ చేరే తాత్కాలిక నేతలు, అవకాశవాదుల వల్ల పార్టీకి కేడర్ నిర్మాణం సాధ్యం కాదు. వేరొకరిని సీఎం పీఠంపై కూర్చోబెట్టడానికి సొంత జేబుల నుంచి వందల కోట్లు తగలేసేంత అమాయకత్వం రాజకీయాల్లో ఏ నాయకుడికీ ఉండదు. విజయసాయిరెడ్డి ఆడుతున్న ఈ విచిత్రమైన కింగ్ మేకర్ డ్రామా వెనుక ఏ అదృశ్య రాజకీయ శక్తి ఉందో, ఆయన అసలు టార్గెట్ జగనా లేక కూటమి ప్రభుత్వమా అనేది రాబోయే రోజుల్లో స్పష్టమవ్వాల్సి ఉంది.

ఫ్యాన్ రెక్కలు విలవిల



విజయనగరం, : ఉత్తరాంధ్ర రాజకీయాల్లో వైఎస్ఆర్సీపీ ఉనికి ప్రశ్నార్థకంగా మారుతోంది. దీనికి క్షేత్రస్థాయి పరిణామాలు బలం చేకూరుస్తున్నాయి. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో దశాబ్దాల పాటు రాజకీయాన్ని శాసించిన ఉద్దండులైన సీనియర్ నేతలు సైతం ఇప్పుడు వైసీపీ జెండా మోసేందుకు వెనుకంజ వేస్తున్నారు. గత ఎన్నికల్లో అధికార దర్పం, అపరిమితమైన ఆర్థిక బలం, పటిష్టమైన యంత్రాంగం ఉండి కూడా దాదాపుగా ప్రతి నియోజకవర్గంలో 50 వేల ఓట్లకు పైగా భారీ వ్యత్యాసంతో ఓడిపోవడం సదరు నేతల ఆత్మవిశ్వాసాన్ని కోలుకోలేని దెబ్బతీసింది. ఆ ఘోర పరాభవం తర్వాతే అనేకమంది సీనియర్లు సైలెంట్ అయిపోగా, మరికొందరు ఇప్పటికే పార్టీకి గుడ్ బై చెప్పారు.ఉత్తరాంధ్ర సామాజిక సమీకరణాలను, ప్రజల ఆలోచనా ధోరణిని నిశితంగా పరిశీలిస్తే.. వైఎస్ఆర్సీపీ మళ్లీ పూర్వవైభవాన్ని పుంజుకోవడం దాదాపు అసాధ్యమనే భావన రాజకీయ వర్గాల్లో బలంగా నాటుకుపోయింది. దీంతో తమ సుదీర్ఘ రాజకీయ అనుభవంతో పరిస్థితిని ముందే అంచనా వేసిన సీనియర్ నాయకులు ఒక వ్యూహాత్మక నిర్ణయానికి వచ్చారు. తాము ప్రత్యక్ష రాజకీయాల నుంచి గౌరవప్రదంగా రిటైర్మెంట్ ప్రకటించడం లేదా క్రియాశీల పాత్ర నుంచి తప్పుకోవడం ఒక మార్గమైతే.. తమ వారసులను, ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని కూటమి పార్టీలైన టీడీపీ లేదా జనసేనలోకి పంపించడం మరో ప్రత్యామ్నాయంగా ఎంచుకుంటున్నారు.ముఖ్యంగా విజయనగరం, విశాఖ జిల్లాల్లో బారీ స్థాయిలో సాగుతున్న ఈ వలసలు కేవలం ఆరంభం మాత్రమే. స్థానిక సంస్థల ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో ప్రాదేశిక, పురపాలక వర్గాల్లో ఉనికి కాపాడుకోవడానికి స్థానిక నేతలు డిఫెన్స్‌లో పడ్డారు. వైసీపీ గుర్తుపై పోటీ చేస్తే గెలుపు అవకాశాలు శూన్యమని భావిస్తున్న వీరు, కూటమిలోని ఏ పార్టీ తలుపు తడితే ఆ పార్టీలో చేరేందుకు సిద్ధపడుతున్నారు. అధికారంలో ఉన్న కూటమి మద్దతు లేకుండా క్షేత్రస్థాయిలో రాజకీయాలు చేయడం సాధ్యం కాదనే స్పష్టత రావడంతో, క్యాడర్ మొత్తం ఒక్కొక్కటిగా ఖాళీ అవుతోంది.పార్టీ కేంద్రీకృత నాయకత్వ శైలి, ఎన్నికల ఫలితాల తర్వాత కనీస దిశానిర్దేశం లేకపోవడం కూడా ఈ సీనియర్ల నిష్క్రమణకు వేగవంతం చేస్తోంది. ఏ రాజకీయ పార్టీకైనా క్షేత్రస్థాయి నాయకులే ఆయువుపట్టు. కానీ ఉత్తరాంధ్ర వ్యాప్తంగా అగ్రనేతల నుంచి క్షేత్రస్థాయి ప్రసిద్ధ ముఖాల వరకు అందరూ జెండా ఎత్తేస్తుండటంతో వైసీపీ పూర్తిగా దెబ్బతింది. రాబోయే స్థానిక పోరు ముగిసేనాటికి ఉత్తరాంధ్రలో వైఎస్ఆర్సీపీ బోర్డు తిప్పేయడం లేదా నామమాత్రపు స్థానానికి పరిమితం కావడం ఖాయంగా కనిపిస్తోంది. ఆయువు పై పట్టు...

ఉత్తరాంధ్రలో వైసీపీకి ఊహించని దెబ్బ తగిలింది. వైసీపీకి బొత్స సత్య నారా యణ మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావు రాజీనామా చేశారు. చిన్న శ్రీను రాజీనామా ఉత్తరాంధ్ర వైసీపీ రాజకీయాలను కుదిపేసింది. తన రాజీనామా లేఖను చిన్న శ్రీను జగన్ కు పంపారు. వ్యక్తిగత కారణాలతోనే తాను పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు చిన్న శ్రీను ఆ లేఖలో పేర్కొన్నా అసలు కారణాలు వేరే ఉన్నాయంటున్నారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి కూడా రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. పార్టీకి, జిల్లా అధ్యక్ష పదవికి మజ్జి శ్రీనివాసరావు రాజీనామా చేస్తున్నట్లు లేఖలో ప్రకటించారు. భీమిలి నియోజకవర్గం సమన్వయకర్త పదవికి కూడా చిన్న శ్రీను రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. వైసీపీకి ఉత్తరాంధ్రలో చిన్న శ్రీను బలమైన నేతగా ఉన్నారు. గత కొన్ని రోజులుగా బొత్స సత్యనారాయణ, ఆయన మేనల్లుడు చిన్న శ్రీనుకు మధ్య అంతర్గత యుద్ధం నడుస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలోనే పార్టీకి రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) పార్టీకి రాజీనామాచేయడం వెనక అనేక కారణాలున్నాయి. గత కొన్ని రోజుల నుంచి బొత్స సత్యనారాయణ పార్టీకి రాజీనామా చేస్తారని ప్రచారం జరిగింది. అయితే బొత్స సత్యనారాయణ కాదని, ఆయన మేనల్లుడు రాజీనామా చేస్తారని నిన్న వెల్లడయింది.

వ్యక్తిగత కారణాలతోనే తాను పార్టీని వీడుతున్నట్లు చిన్న శ్రీను తన రాజీనామా లేఖలో అధికారికంగా పేర్కొన్నారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి పంపించారు. చిన్న శ్రీను తన పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు, విజయనగరం జిల్లా వైసీపీ అధ్యక్ష పదవికి, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త పదవులకు కూడా రాజీనామా చేశారు.చిన్నశ్రీను రాజీనామాకు దారితీసిన అనలు కారణాలు అనేకం ఉన్నాయంటున్నారు.. రాజీనామా లేఖలో ఆయన కేవలం వ్యక్తిగత కారణాల వల్లే పార్టీని వీడుతున్నట్లు పేర్కొన్నారు. రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతున్న అసలు కారణాలు మాత్రం వేరేలా ఉన్నాయి. అధికారికంగా వ్యక్తిగత కారణాలని చెప్పినప్పటికీ, రాజకీయ విశ్లేషకులు మరియు అంతర్గత వర్గాల సమాచారం ప్రకారం ఈ నిర్ణయం వెనుక కొన్ని కీలక వ్యూహాలు ఉన్నట్లు తెలుస్తోంది. బొత్స సత్యనారాయణ కుమార్తె పొలిటికల్ ఎంట్రీయే చిన్న శ్రీను రాజీనామాకు కారణమని తెలుస్తోంది. తన కుమార్తెను క్రియాశీల రాజకీయాల్లోకి తీసుకురావాలని బొత్స భావిస్తున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆమెను విజయనగరం మేయర్ పీఠంపై కూర్చోబెట్టాలని, ఈ మేరకు బొత్స మేయర్ అభ్యర్థి తన కుమార్తె అని ప్రకటించిన తర్వాతనే చిన్న శ్రీను రాజీనామా చేశారని అంటున్నారు.

స్లమ్స్ వారి కోసం భవనాలు

విశాఖపట్టణం, : ఆంధ్రప్రదేశ్ పట్టణాభివృద్ధి, మురికివాడల పునర్నిర్మాణ చరిత్రలో కూటమి ప్రభుత్వం మరో కీలక ఘట్టానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలోనే మొదటిసారిగా ప్రవేశపెట్టిన మురికివాడల పునర్నిర్మాణం ప్రోగ్రామ్‌కు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ విశాఖపట్నం వేలంపేటలో శంకుస్థాపన చేశారు. గత 50 ఏళ్లుగా సరైన నివాస వసతి లేక నిత్యం నరకయాతన అనుభవిస్తున్న 177 కుటుంబాల కలలను సాకారం చేస్తూ, వారి కోసం ఆధునిక అపార్ట్‌మెంట్ నిర్మాణ పనులకు ఆయన అధికారికంగా భూమిపూజ నిర్వహించారు. విశాఖ ఎకనామిక్ రీజియన్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్‌లో భాగంగా ఈ వినూత్న కార్యక్రమాన్ని ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చింది.ఈ ప్రాజెక్టు కింద మొత్తం 177 పేద కుటుంబాలకు ఉచితంగా అత్యాధునిక వసతులతో కూడిన ఇళ్లను నిర్మించి ఇవ్వనున్నారు. 2,691 చదరపు అడుగుల స్థల విస్తీర్ణంలో, 45 మీటర్ల ఎత్తుతో మొత్తం 12 అంతస్తుల టవర్ నిర్మాణం జరగనుంది. మొత్తం 28.44 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ ప్రాజెక్ట్‌లో ఒక్కో ప్లాట్ విలువ సుమారు 16 లక్షలుగా ఉంటుంది. కాంక్రీట్ నిర్మాణాల్లో అత్యంత నాణ్యమైన, వేగవంతమైన షిర్ వాల్ సాంకేతికతను ఉపయోగిస్తూ, రాబోయే 9 నెలల్లోనే నిర్మాణాన్ని పూర్తి చేసి బాధితులకు ఇళ్లను అప్పగించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.పట్టణాల్లోని పేదల జీవన ప్రమాణాలను గణనీయంగా మెరుగుపరచడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయంగా ప్రభుత్వం ధారావి మోడల్ లో ఈ అభివృద్ధి పనులు



చేపడుతోంది. వేలంపేట స్లమ్ రీడెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ రాష్ట్రానికే ఒక రోల్ మోడల్ అని, మురికివాడల్లో నివసించే పేదలకు ఆ స్థలంలోనే బహుళ అంతస్తుల భవనాలు నిర్మించి ఇవ్వడం ద్వారా వారికి ఆర్థిక, సామాజిక భద్రత చేకూరుతుందని నారాయణ చెబుతున్నారు. ఇదే నమూనాలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పలు పట్టణాలు, నగరాల్లోని మురికివాడలను సకల సౌకర్యాలతో అభివృద్ధి చేసేందుకు సమగ్ర ప్రణాళికలు రచిస్తున్నామని వెల్లడించారు.దశాబ్దాలుగా మురికివాడల్లో అరకొర వసతులతో, అపరిశుభ్ర వాతావరణంలో బతికిన పేద కుటుంబాలకు విశాఖ నడిబొడ్డున 16 లక్షల విలువైన మోడల్ ప్లాట్ ఉచితంగా దక్కనుండటంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం విశాఖ నగరాన్ని మురికివాడలు లేని నగరంగా మార్చడానికి దోహదపడటమే కాకుండా, రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని ప్రధాన నగరాల రూపురేఖలను పూర్తిగా మార్చివేస్తుందని భావిస్తున్నారు.

పాదయాత్రల సీజన్



విజయవాడ, : ఏపీ, తెలంగాణలో వచ్చే ఏడాది పాదయాత్ర సీజన్ మొదలయ్యేలా కనిపిస్తోంది. ఈసారి ఎలాగైనా అధికారంలోకి రావాలని చూస్తున్న వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. తాను రాష్ట్రవ్యాప్తంగా 'పాదయాత్ర 2.0' చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. తాడేపల్లిలోని పార్టీ సెంట్రల్ ఆఫీసులో పర్యాచారు నియోజకవర్గ నాయకులు, ముఖ్య కార్యకర్తలతో బుధవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో జగన్ పాల్గొన్నారు. 2027 సెప్టెంబర్ లేదా అక్టోబర్ నెలలో తాను పాదయాత్ర ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. రాబోయే 2029 అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, క్షేత్రస్థాయిలో వైసీపీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడమే పాదయాత్ర లక్ష్యంగా పేర్కొన్నారు. గతంలో వైఎస్ జగన్ చేపట్టిన 'ప్రజా సంకల్ప యాత్ర' ఆయన రాజకీయ జీవితంలోనే కీలకంగా మారింది. ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలోనే ఒక మైలురాయిగా నిలుస్తూ అధికారం సొంతం చేసుకున్నారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్ పేరుతో ఏపీ ప్రభుత్వం డ్రాలు చేస్తుందని, ఇవన్నీ కోర్టులో చెల్లవని సీఎం చంద్రబాబుకు ముందే తెలుసునన్నారు. ఎఫ్ఐఆర్ ప్రక్రియతో రాష్ట్రంలో 44 లక్షల ఓట్లు గల్లంతయ్యాయని, చంద్రబాబు ఉండగా ఎన్నికలు సజావుగా సాగే అవకాశమే లేదని కీలక వ్యాఖ్యలు చేశారు. స్థానిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం కుట్రలకు పాల్పడుతుందని, ఎలాంటి పరిస్థితుల్లో ఎన్నికలు జరుగుతున్నాయో అర్థం చేసుకుని వైసీపీ నేతలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గట్టిగా పోరాటం చేసి ఎన్నికల్లో విజయాలు సాధించాలని దిశానిర్దేశం చేశారు.2017 నవంబర్ 6న వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయలోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ స్మృతి వనం నుంచి ప్రారంభమైన ఆ యాత్ర సుమారు 341 రోజుల పాటు సాగింది. అప్పటి మొత్తం 13 జిల్లాల్లోని 134 నియోజకవర్గాలు, 2,516 గ్రామాల మీదుగా 3,648 కిలోమీటర్లు చేసిన ఈ పాదయాత్రలో కోట్ల మంది ప్రజలను నేరుగా కలుసుకున్నారు.ఆ రోజుల్లో ప్రతిపక్ష నేతగా రైతులు, మహిళలు, యువత, నిరుద్యోగులు, అన్ని వర్గాల సమస్యలను తెలుసుకున్న జగన్ 'నవరత్నాలు' సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం కల్పించారు. ఈ ప్రజా సంకల్ప యాత్ర అందించిన ప్రజాదరణతోనే 2019 సాధారణ ఎన్నికల్లో వైఎస్సార్సీపీ 151 స్థానాల్లో ఘనవిజయం సాధించి అధికారంలోకి వచ్చింది. మరోసారి ప్రజల్లోకి వెళ్లేందుకు 'పాదయాత్ర 2.0' చేస్తానని జగన్ నిర్ణయం తీసుకున్నారు

'సీ ప్లేన్' ప్రాజెక్టుకు లైన్ క్లియర్



విజయవాడ, : ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగ చరిత్రలో సరికొత్త అధ్యాయం మొదలుకాబోతోంది. రాష్ట్రంలో వినూత్నంగా ప్రవేశపెట్టాలని భావిస్తున్న ప్రతిష్టాత్మక 'సీ ప్లేన్' ప్రాజెక్టుకు లైన్ క్లియర్ అయింది. ఏపీ జలాలపై ఈ విమానాలను నడిపేందుకు ఆసక్తి చూపిస్తూ 'మే హెయిర్', 'స్కైహాప్' వంటి ప్రముఖ దేశీయ విమానయాన సంస్థలు సమర్పించిన నివేదికలకు కేంద్ర పౌరవిమానయాన శాఖ అధికారికంగా ఆమోద ముద్ర వేసింది. పర్యాటక ప్రాంతాల మధ్య రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచడమే కాకుండా, టూరిస్టులకు సరికొత్త థ్రిల్లింగ్ అనుభూతిని అందించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును వేగంగా ముందుకు తీసుకువెళ్తున్నారు.ఈ ప్రాజెక్టు సజావుగా సాగడానికి కీలకమైన 'వాటర్ డ్రోమ్' అంటే నీటిపై రన్‌వేలు, మౌలిక వసతుల ఏర్పాటుపై ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ ప్రత్యేకంగా దృష్టి సారించింది. వీటి నిర్మాణానికి అవసరమైన ఇంజనీరింగ్ పనుల కోసం త్వరలోనే టెండర్ల ప్రక్రియను ప్రారంభించనున్నారు. ఒక అంచనా ప్రకారం, రాష్ట్రవ్యాప్తంగా దాదాపు పది కీలక పర్యాటక మరియు ఆధ్యాత్మిక కేంద్రాలను గుర్తిస్తూ, సుమారు రూ. 200 కోట్ల వ్యయంతో ఈ వాటర్ డ్రోమ్ నెట్‌వర్క్‌ను డెవలప్ చేయనున్నారు.కేంద్ర ప్రభుత్వ 'ఉడాన్' ఉద్దీపన పథకం మద్దతు కూడా ఉండటంతో ఈ ప్రాజెక్ట్ చాలా త్వరగా కార్యరూపం దాల్చే అవకాశం కనిపిస్తోంది. తొలి విడతలో భాగంగా.. విజయవాడ ప్రకాశం బ్యారేజ్ (పున్నమి ఘాట్), విశాఖ సాగరం, మరియు శ్రీశైలం కృష్ణా నది పరివాహక ప్రాంతాల మధ్య ఈ సీ ప్లేన్లు రాకపోకలు సాగించనున్నాయి. వీటితో పాటు కాకినాడ, సూర్యలంక బీచ్, గండికోట గిరి లోయలు, తిరుపతి రాయలచెరువు, అరకు సమీపంలోని జోలాపుట్ మరియు లంబసింగి తాజంగి జలాశయాలను కూడా ఈ రూట్ మ్యాప్‌లో చేర్చారు. ఈ వినూత్న సేవలు అందుబాటులోకి వస్తే.. ప్రముఖ పుణ్యక్షేత్రాలు, విహారయాత్ర స్థలాల మధ్య ప్రయాణ సమయం భారీగా తగ్గడమే కాకుండా, ఏపీ టూరిజం గ్లోబల్ మ్యాప్‌లో మరింత ప్రత్యేకంగా నిలవనుంది

ఏపీ వ్యాప్తంగా సర్కారీ మీ మార్ట్

విజయవాడ, : టైర్ వన్, టైర్ టు, టైర్ త్రీ.. ఇలా మూడంచల విధానంలో వ్యాపారం చేస్తోంది డి మార్ట్. పప్పుల నుంచి ఉప్పుల దాకా.. బట్టల నుంచి నెత్తికి రాసుకునే నూనె దాకా ఇలా ప్రతి వస్తువును వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొచ్చి.. తక్కువ ధరలో అమ్ముతూ తిరుగులేని మార్కెట్ ను డి మార్ట్ సొంతం చేసుకుందిగతంలో ఫ్యూచర్ గ్రూప్ ఆధ్వర్యంలో బిగ్ బజార్ ఉండేది. ఆ తర్వాత రిటైల్ విభాగంలోకి అనేక పెద్ద పెద్ద సంస్థలు వచ్చాయి. కాకపోతే అవేవీ కూడా మార్కెట్ పరిస్థితులను అంచనా వేయలేక.. సరైన వాటాను సొంతం చేసుకోలేకపోయాయి. రిలయన్స్.. ఆదిత్య బిర్లా.. ఇంకా అనేక పేరు మోసిన సంస్థలు ఉన్నప్పటికీ రిటైల్ విభాగంలో ఆశించిన మార్కెట్ వాటాను అందుకు లేకపోయాయి. కాకపోతే డిమార్ట్ డిఫరెంట్ ప్లాన్ తో రంగంలోకి వచ్చింది. తిరుగులేని మార్కెట్ వాటాను సొంతం చేసుకుంది. దీనిపై అనేక రకాలుగా ఆరోపణలు ఉన్నప్పటికీ డీమార్ట్ దూకుడు జోరుగాని సాగుతోంది.డి మార్ట్ దూకుడుకు కళ్లెం వేయడంలో పెద్దపెద్ద కార్పొరేట్ సంస్థలే తట్టుకోలేకపోయాయి. కానీ ఇప్పుడు ఆ బాధ్యతను ఏపీ ప్రభుత్వం భుజాలకు ఎత్తుకుంది. వాస్తవానికి ఒక కార్పొరేట్ సామ్రాజ్యాన్ని ఢీకొట్టడం.. అది కూడా ఒక ప్రభుత్వం చేయడం అనేది దేశ చరిత్రలో ఇదే తొలిసారి. వాస్తవానికి డీమార్ట్ చాప కింద నీరు లాగా విస్తరిస్తున్న నేపథ్యంలో.. ప్రజలకు మరింత తక్కువ ధరలో సరుకులు అందించడానికి.. ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో డీమార్ట్ కు పోటీగా అదే స్థాయిలో మీ మార్ట్ ఏర్పాటు చేస్తోంది.



తక్కువ ధరలకే నాణ్యమైన సరుకులను అందించడానికి నేషనల్ కో-ఆపరేటివ్ కన్స్యూమర్ ఫెడరేషన్ సహకారం తీసుకోబోతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 1000 మీ మార్ట్ లను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది.ఇప్పటివరకు ఏకంగా 870 షాపులను ప్రభుత్వం సిద్ధం చేసింది. మరో 130 షాపులను వేగంగా పూర్తి చేయడానికి అడుగులు వేస్తోంది. అక్టోబర్ 1 న ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా మీ మార్ట్ లను ఒకేసారి ప్రారంభించబోతున్నారు. డి మార్ట్ తో పోటీపడేందుకు.. సేమ్ అదే కాన్సెప్ట్ తో మీ మార్ట్ లను ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. తక్కువ ధరకే సరుకులు అందించేలా వీటిని రూపొందిస్తుంది. ముందుగా మీ మార్ట్ లలో 64 సరుకులను అందుబాటులో ఉంచుతారు. ఆ తర్వాత మరిన్ని సరుకులను విస్తరిస్తారు. తద్వారా ఏపీ ప్రజలకు ఆర్థిక భరోసా ఇవ్వడమే కాకుండా.. వారికి నాణ్యమైన సరుకులు అందిస్తారు

పాఠశాలలను తనిఖీ చేసిన ఎంఈఓ ఎండీ. ఖాసీం

పిడుగురాళ్ల, : పిడుగురాళ్ల మండల విద్యాశాఖాధికారి ఎండీ. ఖాసీం పిడుగురాళ్ల మండలంలోని కరాలపాడులో గల మండల ప్రాథమిక ఆదర్శ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కరాలపాడు లను తనిఖీ చేశారు. పాఠశాలల్లోని అందరూ ఉపాధ్యాయులు సమయపాలన పాటించి అసెంబ్లీకి హాజరు కావడంతో పాటు విద్యార్థులందరూ కూడా ఏకరూప దుస్తులతో సమయపాలన పాటిస్తూ పాఠశాలకు హాజరు కావడం పట్ల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు ఎండి అభినందించారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు అందరూ మూడవ తరగతి నుండి విద్యార్థులకు హిందీ బోధించడంతో పాటు కాలిగ్రఫీ దస్తూరి ద్వారా నోటు పుస్తకాలు వ్రాయించటం, అంతేకాకుండా మూడో తరగతి నుండి విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించి అందరికీ బహుమతులు అందించడం, పాఠశాల అనంతరం కూడా ఒక గంట అదనంగా ప్రధానోపాధ్యాయులు కే. కొండయ్య చొరవ చూపి ఉపాధ్యాయుల సహకారంతో ప్రత్యేక తరగతులు నిర్వహించడం పట్ల ప్రధానోపాధ్యాయులు కె. కొండయ్య మరియు ఉపాధ్యాయులు జి. పోతిరెడ్డి, వై శ్రీనివాసరావు, రేపల్లె సునంద, అనగాని మనీషా లను ఖాసీం అభినందించారు. అనంతరం మండల ప్రాథమిక పాఠశాల కామేపల్లిని సందర్శించి పాఠశాలలో విద్యార్థులు అందిస్తున్న రాగి జావాను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

వారానికి ఓ పాలి.. ఇక నీకు తిరుగుండదోయి..



కరివేపాకు సాధారణంగా మనం కూరల నుండి తీసి పక్కన పెట్టేస్తుంటాం. కానీ అదే కరివేపాకుతో అద్భుతమైన రుచికరమైన, ఆరోగ్యకరమైన పులుసును సులభంగా తయారు చేసుకోవచ్చు. కంటి చూపు మెరుగుపరచడం, జుట్టు ఆరోగ్యానికి, రక్తాన్ని శుద్ధి చేయడానికి కరివేపాకు ఎంతో మేలు చేస్తుంది. ఈ వంటకం వారానికి ఒకసారైనా తింటే పిల్లలు కూడా ఇష్టంగా తింటారు. మనం ప్రతిరోజూ వండుకునే కూరల్లో అద్భుతమైన రుచిని, సువాసనను అందించే కరివేపాకును చాలామంది తినేటప్పుడు తీసి పక్కన పెట్టేస్తుంటారు. అయితే, ఈ కరివేపాకు కేవలం రుచి కోసమే కాకుండా, మన ఆరోగ్యానికి ఎన్నో రకాలుగా మేలు చేస్తుంది. కంటి చూపు మెరుగుపరచడం నుండి జుట్టు కుదుళ్లను బలోపేతం చేయడం వరకు, శరీరంలోని మలినాలను పోగొట్టి రక్తాన్ని శుద్ధి చేసే అద్భుతమైన శక్తి కరివేపాకుకు ఉంది.

కావలసిన పదార్థాలు: కరివేపాకు – 2 కప్పులు, నూనె – సరిపడినంత, ఆవాలు – అర స్పూన్, జీలకర్ర – పావు స్పూన్, ఎండుమిర్చి – 1, వెల్లుల్లి రెబ్బలు –గుప్పెడు, పచ్చిమిర్చి – 2–3 (ముక్కలు), ఉల్లిపాయలు – 4 (సన్నగా తరిగినవి), ఉప్పు – రుచికి సరిపడా, పసుపు –కొద్దిగా, కారం–2 స్పూన్లు (తినే కారాన్ని బట్టి), బెల్లం – చిన్న ముక్క, చింతపండు రసం – నిమ్మకాయ సైజంత చింతపండు నుండి తీసినది, నీళ్ళు ?

సరిపడినంత తయారీ విధానం: 1. కరివేపాకు వేయించడం: ముందుగా స్టవ్‌మీదకడాయి పెట్టి, రెండు మూడు స్పూన్ల నూనె వేసి వేడి చేయాలి. నూనె కాగిన తర్వాత కడిగి, తడి లేకుండా ఆరబెట్టిన రెండు కప్పుల కరివేపాకు వేసుకోవాలి. మంటను మీడియం ఫ్లేమ్ లో ఉంచి, కరివేపాకు క్రిస్పీగా అయ్యేంత వరకు కలుపుతూ వేయించాలి. సరిపడినంత నూనె వేసుకోవడం ముఖ్యం. వేగిన కరివేపాకును నూనె రాకుండా ఒక గిన్నెలోకి తీసుకుని, పూర్తిగా చల్లారిన తర్వాత మిక్సీ జార్ లో వేసిమెత్తగా గ్రైండ్ చేసుకోవాలి.రోట్లో వేసుకున్నా బాగా మెత్తగా రుబ్బుకోవచ్చు. 2.పోపు తయారీ: కరివేపాకు వేయించిన నూనెలో కూరకి సరిపడినంత నూనె అదనంగా వేసుకోవాలి. నూనె కాగిన తర్వాత అర స్పూన్ ఆవాలు, పావు స్పూన్ జీలకర్ర, ఒక ఎండుమిర్చి వేసి ఒకసారి కలిపి, తొక్కలు వలిచిన గుప్పెడు వెల్లుల్లి రెబ్బలు వేసుకోవాలి. వెల్లుల్లి ఇష్టం లేని వారు స్కిప్ చేయవచ్చు. ఇవి వేగిన తర్వాత రెండు మూడు పచ్చిమిర్చిల ముక్కలు, సన్నగా తరిగిన నాలుగు ఉల్లిపాయల ముక్కలు వేసి రుచికి సరిపడా ఉప్పు కూడా కలపాలి.

ఈ స్నాక్‌తో పిల్లలకు ఐరన్, కాల్షియం కొండంత బలం!



మన పూర్వీకులు రాగులతో చేసిన వంటకాలను ఎక్కువగా తీసుకోవడం వల్లే ఎంతో దృఢంగా, ఆరోగ్యంగా ఉండేవారు. ఈ మధ్యకాలంలో జనాల్లో ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగి మళ్లీ సిరిధాన్యాల వాడకం పెరిగింది. ముఖ్యంగా మహిళల్లో వచ్చే రక్తహీనత, ఎముకల బలహీనత వంటి సమస్యలకు రాగులు ఒక సంజీవనిలా పనిచేస్తాయని పెద్దలు చెబుతున్నారు. మరి అంతటి పోషక విలువలున్న రాగి పిండితో ఎప్పుడూ ఒకే లాంటి టిఫిన్స్ తింటే బోర్ కొడుతుంది కదా. అందుకే ఎప్పటిలాగా రాగి దోసా, రోటీ, సంకటి లాంటివి కాకుండా కేవలం కొద్ది నిమిషాల్లోనే ఎంతో రుచికరమైన రాగి చెక్కలను ఎలా చేసుకోవాలో ఈ స్పెషల్ స్టోరీలో తెలుసుకుందాం? కావలసిన పదార్థాలు: రాగి పిండి/ బియ్యం పిండి (చెక్కలు క్రిస్పీగా రావడం కోసం)/ వేరుశెనగ పప్పులు (కొద్దిగా కచ్చాపచ్చాగా దంచినవి)/ నువ్వులు/ పచ్చిమిర్చి, అల్లం పేస్ట్/ కరివేపాకు, కొత్తిమీర తరుగు/ ఉప్పు (తగినంత)/ వెన్న లేదా వేడి నూనె (పిండి కలుపుకోవడానికి)/ డీప్ ఫ్రైకి సరిపడా నూనె తయారీ విధానం.. ముందుగా ఒక వెడల్పాటి గిన్నెలో రాగి పిండి, కొద్దిగా బియ్యం పిండి తీసుకోండి. అందులో నువ్వులు, కచ్చాపచ్చాగా దంచిన వేరుశెనగ పప్పులు, తగినంత ఉప్పు వేసి బాగా కలుపుకోండి. తర్వాత ఈ మిశ్రమంలో పచ్చిమిర్చి–అల్లం పేస్ట్, సన్నగా తరిగిన కరివేపాకు, కొత్తిమీర వేయండి. చెక్కలు సాఫ్ట్‌గా, క్రిస్పీగా రావడం కోసం కొద్దిగా వెన్న లేదా వేడి నూనె వేసి పిండిని బాగా ముద్దలా కాకుండా పొడిపొడిగా కలుపుకోవాలి. ఇప్పుడు కొద్దికొద్దిగా గోరువెచ్చని నీటిని పోస్తూ, చపాతీ పిండి కంటే కొంచెం గట్టిగా (మరీ జారుడుగా కాకుండా) ముద్దలా కలుపుకుని పక్కన పెట్టుకోవాలి. అలా పక్కన పెట్టుకున్న పిండిని చిన్న చిన్న ఉండలుగా చేసుకోవాలి. ఒక ప్లాస్టిక్ కవర్ లేదా బట్టర్ పేపర్‌పై కొద్దిగా నూనె రాసి, ఈ ఉండలను చేత్తో పలచని చెక్కల్లా ఒత్తుకోవాలి. ఆపై కాగుతున్న నూనెలో వేసి రెండు వైపులా చక్కగా కాలే వరకు మీడియం ఫ్లేమ్‌పై డీప్ ఫ్రై చేయాలి. అంతే ఆరోగ్యకరమైన రాగి చెక్కలు రెడీ.

మద్యం కాలేయానికే కాదు.. మెదడుకూ ముప్పే..!



మద్యం సేవించడం వల్ల కాలేయం, గుండెకు మాత్రమే నష్టం జరుగుతుందని చాలామంది భావిస్తుంటారు. అయితే, మద్యం ప్రభావం మెదడుపైనా తీవ్రంగా పడుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తరచూ లేదా అధికంగా మద్యం సేవించడం వల్ల జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం, నిద్ర నాణ్యత వంటి మెదడు పనితీరుపై ప్రతికూల ప్రభావం పడుతుందని న్యూరాలజిస్టులు చెబుతున్నారు.

మెదడులో జ్ఞాపకశక్తి, నేర్చుకునే సామర్థ్యానికి కీలకమైన హిప్పోక్యాంపస్‌పై మద్యం మొదట ప్రభావం చూపుతుంది. దీని వల్ల తాత్కాలిక జ్ఞాపకాలను దీర్ఘకాలిక జ్ఞాపకాలుగా మార్చే ప్రక్రియ దెబ్బతింటుంది. ఫలితంగా ఎక్కువ మద్యం సేవించినప్పుడు కొందరికి 'బ్లాక్‌అవుట్స్' ఏర్పడి, ఆ సమయంలో జరిగిన విషయాలు పూర్తిగా గుర్తు లేకపోవచ్చు. అంతేకాదు.. మద్యం జ్ఞాపకశక్తినే కాకుండా మెదడులోని ఫ్రంటల్ లోబ్‌పై కూడా ప్రభావం చూపుతుంది. ఈ భాగం ఏకాగ్రత, ప్రణాళిక, సరైన నిర్ణయాలు తీసుకోవడం, భావోద్వేగాలను నియంత్రించడం వంటి కీలక పనులను నిర్వహిస్తుంది. మద్యం ఎక్కువగా తీసుకునేవారికి సంభాషణలను అర్థం చేసుకోవడం, పేర్లు గుర్తుంచుకోవడం, సమస్యలను పరిష్కరించడం వంటి పనులు క్రమంగా కష్టమవుతాయి.

మద్యం తాగితే బాగా నిద్రపడుతుందని చాలామంది అనుకుంటారు. కానీ అది కేవలం తాత్కాలిక మత్తును మాత్రమే కలిగిస్తుంది.

బాదం పప్పుతో మధుమేహానికి చెక్..!



భారతదేశంలో మధుమేహం బారిన పడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ ఆందోళనకరంగా పెరుగుతోంది. బ్లడ్ షుగర్ స్థాయిలను అదుపులో ఉంచుకోవడానికి మందులతో పాటు మనం తీసుకునే ఆహార నియమాలు కూడా అంతే ముఖ్యం. ముఖ్యంగా ఉదయం పూట బ్రేక్‌ఫాస్ట్‌కు ముందు తీసుకునే ఆహారం రోజంతా మన జీవక్రియలను ప్రభావితం చేస్తుంది. అందుకే, డయాబెటిస్ ఉన్నవారు ప్రతిరోజూ ఉదయాన్నే ఖాళీ కడుపుతో నానబెట్టిన బాదంపప్పులను తినాలని వైద్యులు మరియు పోషకాహార నిపుణులు బలంగా సిఫార్సు చేస్తున్నారు. ఇన్సులిన్ పనితీరును మెరుగుపరుస్తుంది: బాదంలో మెగ్నీషియం ఖనిజం పుష్కలంగా ఉంటుంది. డయాబెటిస్ ఉన్నవారిలో చాలా మందికి మెగ్నీషియం లోపం ఉన్నట్లు పరిశోధనల్లో తేలింది. శరీరంలో తగినంత మెగ్నీషియం ఉంటే, అది ఇన్సులిన్ హార్మోన్ కణాల్లోకి గ్లూకోజ్‌ను పంపే ప్రక్రియను సులభతరం చేస్తుంది. అంటే బాదం తినడం వల్ల శరీరం ఇన్సులిన్‌ను మరింత సమర్థవంతంగా వాడుకుంటుంది. షుగర్ స్పైక్స్‌ను అడ్డుకుంటుంది: బాదంపప్పులలో కార్బోహైడ్రేట్లు చాలా తక్కువగా ఉండి, ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రొటీన్లు, ఫైబర్ సమృద్ధిగా ఉంటాయి. ఉదయాన్నే పరగడుపున వీటిని తినడం వల్ల జీర్ణక్రియ నెమ్మదిస్తుంది.

దీపావళి బరిలో 'మూకుత్తి అమ్మన్-2'



లేడీ సూపర్ స్టార్ నయనతార ప్రధాన పాత్రలో నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ ఫాంటసీ ఎంటర్‌టైనర్ చిత్రం 'మూకుత్తి అమ్మన్–2'. గతంలో తమిళంతో పాటు తెలుగు సినీ ప్రియులను ఎంతగానో అలరించి బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని సాధించిన ఈ మూవీ 'మూకుత్తి అమ్మన్' చిత్రానికి సీక్వెల్‌గా రాబోతుంది. సీనియర్ దర్శకుడు సుందర్ సి అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్‌లో నయనతార మరొకసారి పవర్‌ఫుల్ దేవత పాత్రలో కనిపించి తన అద్భుత నటనతో ప్రేక్షకులను మెప్పించబోతున్నారు.

ఈ ప్రతిష్టాత్మక సినిమాను అవ్ని సినిమాస్, వెల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీ, ఐవీ ఎంటర్‌టైన్‌మెంట్స్, రౌడీ పిక్చర్స్ బ్యానర్లపై నిర్మాత ఇషారి గణేష్ ఎంతో భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో టాలెంటెడ్ బ్యూటీ రెజీనా కాసాండ్రా, స్టార్ కమెడియన్ యోగిబాబు అత్యంత కీలక పాత్రలో కనిపించనున్నారు. అయితే ఈ సినిమా షూటింగ్ ప్రారంభమై ఇప్పటికే చాలా రోజులు గడుస్తున్నప్పటికీ, మూవీ విడుదలపై ఇప్పటివరకు చిత్ర బృందం నుంచి ఎలాంటి అధికారిక స్పష్టత రాకపోవడంతో తీవ్రమైన సందిగ్ధత నెలకొంది. దీంతో నయనతార అభిమానులు తీవ్ర నిరాశ చెందుతున్నారు.

ఆ భయంతో అవకాశాలు వదులుకున్నా..



కోలీవుడ్ యంగ్ బ్యూటీ ఐశ్వర్య లక్ష్మి ఇటీవల 'గట్టకుస్తీ-2' చిత్రంతో బ్లాక్ బస్టర్ హిట్ తన ఖాతాలో వేసుకుంది. ఇక ఇప్పుడు తెలుగులో సాయి దుర్గా తేజ్ సరసన 'సంబరాల ఏటిగట్టు' సినిమాలో హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుపుకుంటోంది. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా విడుదల కాబోతోంది. ఇదిలా ఉంటే, తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఐశ్వర్య లక్ష్మి తన జీవితంలో ఎదురైన చేదు అనుభవాలను పంచుకుంటూ బాగా ఎమోషనల్ అయ్యారు. 2023లో దుల్కర్ సల్మాన్‌తో కలిసి చేసిన 'కింగ్ ఆఫ్ కోథా' సినిమా విడుదలైన తర్వాత తనపై వచ్చిన దారుణమైన ట్రోల్స్ తన జీవితంపై చాలా ప్రభావం చూపాయని ఐశ్వర్య ఆవేదన వ్యక్తం చేశారు. ఆ మూవీ దెబ్బతో మలయాళ ఇండస్ట్రీలో తనకు అవకాశాలు ఇవ్వడానికి కూడా నిర్మాతలు, దర్శకులు భయపడినట్లు అనిపించిందని చెప్పారు. సినిమాలో తన నటన, డైలాగ్ డెలివరీపై ఎన్నో విమర్శలు వచ్చాయని, కొన్నిసార్లు వారు అన్నది నిజమేనేమో అని కూడా తనకు అనిపించేదని తెలిపారు. ముఖ్యంగా ఆ చిత్రంలో దుల్కర్‌ను తాను 'రాజువెట్టా' అని పిలవడాన్ని నెటిజన్లు తీవ్రంగా ఎగతాళి చేశారని అన్నారు. ఈ మూవీ షూటింగ్ సమయంలో ఓ అసిస్టెంట్ డైరెక్టర్ తనను పిలిచి మరీ వెక్కిరించాడని, ఆ సమయంలో తను చాలా బాధపడినట్లు వెల్లడించారు. దుల్కర్ సల్మాన్‌తో మరోసారి నటించే అవకాశం వచ్చినప్పటికీ, ఆ ట్రోలింగ్ దెబ్బకు భయపడి ఆ ప్రాజెక్ట్‌ను వదులుకున్నానని తెలిపారు.

బయోపిక్‌లో రష్మిక ఛాన్స్.....

నేషనల్ క్రష్ రష్మిక మందన్న.. పెళ్లి తర్వాత సినిమాల్లో జోరు పెంచింది. ఈ మేరకు తన భర్త రౌడీ హీరో విజయ్ దేవరకొండతో 'రణబాలి'తో పాటు, లేడీ ఓరియెంటెడ్ మూవీ 'మైసా'కోసం సిద్ధం అవుతున్నది. ఈ సినిమాలు రెండు ప్రాజెంట్ షూటింగ్ దశలో ఉండగా.. రష్మిక తదుపరి మూవీకి సంబంధించిన లేటెస్ట్ అప్డేట్ వచ్చింది. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో భారతరత్న, దిగ్గజ కర్ణాటక గాయని ఎంఎస్ సుబ్బలక్ష్మి బయోపిక్ రాబోతున్న విషయం తెలిసిందే. మొదటి ఈ సినిమాలో ఎంఎస్ సుబ్బలక్ష్మి పాత్ర కోసం సాయి పల్లవి, రుక్మిణి వసంత్ లాంటి పేర్లు వినిపించగా.. డేట్స్ సర్దుబాటు కాకపోవడంతో రష్మికను సంప్రదించారట మేకర్స్. దాదాపు ఇందులో రష్మిక కన్ఫర్మ్ అయినట్లు తెలుస్తుండగా.. అల్లు అరవింద్, బన్నీ వాసు, రాక్‌లైన్ వెంకటేష్ సంయుక్తంగా నిర్మించబోతున్నారట. ఇప్పటికే రష్మిక మందన్న ప్రోమో షూట్ కూడా పూర్తయినట్లు ఫిలిమ్ వర్గాల నుంచి వార్తలు వస్తుండగా.. దసరా సందర్భంగా లేదా, ఎం.ఎస్. సుబ్బలక్ష్మి జయంతి కానీ ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉన్నట్లు సమాచారం.



Edited, Printed, Published & Owned by PUSALA SRINIVAS, Printed at D.K. Publications,2-3-691/1/A CPL Main Road, Amberpet, Hyderabad and Published # Do.No. 2-2-1075/20/E/1, Opp. Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13. Editor : PUSALA SRINIVAS, RNI. NO. APTEL/2008/26737. Cell: 9603754136, 9949653944 E-mail: dkchaatimpu80@gmail.com